ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కరీంనగర్ fb.com/vaartha

Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-12-2024 బుధవారం సంపుటి: 30 సంచిక: 306 పేజీలు: 8+16 వెల: 6.50



15 జిల్లాల్లో ఇంటింటి సర్వే నూరు శాతం పూర్తి 2

వరంగల్‌లో బ్యాంకు ఉద్యోగి దారుణ హత్య 6





## అదానీ వ్యవహారంపై 'ఇండియా' ఆందోళన

### పార్లమెంటు వద్ద విపక్ష నేతల నిరసన

మంగళవారం పార్లమెంటు వద్ద ఆందోళన చేస్తున్న విపక్ష ఎంపీలు రాహుల్ తదితరులు



## పొలం గట్లపై సోలార్ ప్లాంట్లు

### రైతులకు అదనపు ఆదాయం

### నోడల్ ఏజెన్సీగా రెడ్కో

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణలోని రైతులు ఇక నుంచి తమ వ్యవసాయ భూముల్లో సాధారణ పంటలకు భిన్నంగా సోలార్ పంట పండించొచ్చు. >>2



## నేటి మధ్యాహ్నం అంతరిక్షంలోకి మరో అద్భుత ప్రయోగం

### శ్రీహరికోట నుంచి దూసుకుపోనున్న పిఎస్ఎల్ వి సి -59

### యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఉపగ్రహాలు నింగిలోకి

# ఉత్తర ఆర్ఆర్ఆర్‌కు అటవీ అనుమతులు



### రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

### ఇప్పటి దాకా 90% భూ సేకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు3:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన అటవీ అనుమతులను కేంద్రపర్యావరణ మంత్రిత్వశాఖ మంజూరీ చేసినట్టు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర అటవీశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కైలాష్ భీమ్‌రావ్ భవర్ లేఖ రూపంలో తెలియజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పంపిన లేఖలో రీజినల్ రింగ్ రోడ్డు (ఉత్తర భాగానికి)కు ప్రధాన సమస్యగా ఉన్న అటవీ భూములకు సంబంధించిన అనుమతులను ఇస్తూ.. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారని మంగళవారం సాయంత్రం మంత్రి ఓ ప్రకటనలో తెలిపారు. అటవీ అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం 26.07.2024 తేదీన పంపించిన ఆన్‌లైన్ ప్రతిపాదనలను ఆమోదించేందుకు అటవీ సంరక్షణ చట్టం1980 లోని సెక్షన్‌2 ప్రకారం పరిశీలించడమే కాకుండా కేంద్రప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టం1980 చట్టం క్రింద ఏర్పాటు చేసిన అటవీ సంరక్షణ చట్టం2023 లోని నియమం 10 క్రింద ఏర్పాటు చేసిన రీజినల్ ఎంపవర్డ్ కమిటీ (ఆర్ఈసీ) అనుమతులను మంజూరు చేసినట్లు మంత్రి తెలియజేశారు. 19 సెప్టెంబర్ 2024న జరిగిన 69వ సమావేశంలో ఆర్ఈసీ ఈ అంశాన్ని చర్చించిన తరువాత, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అదనపు పత్రాలను పరిశీలించి, ఈ ప్రతిపాదనకు అటవీ సంరక్షణ చట్టం1980 లోని సెక్షన్ 2 క్రింద "ఇన్‌ప్రిన్సిపల్" అనుమతిని మంజూరు చేస్తున్నట్లు సమాచారం ఇచ్చిందని మంత్రి వివరించారు. ఈ అనుమతుల ప్రకారం మెదక్ జిల్లాలో 35.5882 హెక్టార్లు, సిద్దిపేట జిల్లాలో 28.2544 హెక్టార్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 8.511 హెక్టార్లు మొత్తంగా మూడు జిల్లాల్లో కలిపి 72.3536 హెక్టార్ల అటవీ భూమిని భారత్‌మాల పరియోజన ఫేజ్1 కింద ఎన్.హెచ్.ఏ.ఐ >>2

## న్యూయార్క్, టోక్యో తరహాలో..

# ఫ్యూచర్ సిటీ

### లక్షన్నర కోట్లు వెచ్చిస్తే హైదరాబాద్ అద్భుత నగరం

### భట్టి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం

### మోదీని తీసుకొచ్చి మూసీని చూపించండి

### ఎవరు మూసీలో మునిగినా ప్రక్షాళన ఆగదు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం తెచ్చారు?

### తెలంగాణ రైజింగ్ వేడుకల్లో సిఎం రేవంత్



హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల్లో నగర మ్యాప్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్. చిత్రంలో డిప్యూటీ సిఎం భట్టి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు2:** విశ్వనగరంగా హైదరాబాద్ తీర్చిదిద్ది, న్యూయార్క్ లాంటి నగరాలతో సమానంగా నగరాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెడితే హైదరాబాద్ అద్భుత నగరం అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వహించిన రైజింగ్ వేడుకల్లో సిఎం రేవంత్ మాట్లాడారు. హైదరాబాద్ అంటే రాష్ట్రానికే కాదు..ప్రపంచంలోనే ఒక గుర్తింపు ఉంది. హైదరాబాద్‌లో ఐటీ అభివృద్ధికి పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. నగరంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కృష్ణా జలాలనే కాదు.. గోదావరి జలాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కాంగ్రెస్ ముందుచూపుతో వ్యవహరించడం వల్లే హైదరాబాద్ నగరంలో తాగు నీటి సమస్య పరిష్కారమైందన్నారు.. హైదరాబాద్‌కు మెట్రోను తీసుకొచ్చేందుకు ఆనాడు కేంద్రమంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డి ఎంతోకృషి చేశారని, అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ కృషి వల్లే హైదరాబాద్ నగరానికి పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రూ.35 వేల కోట్లతో 360 కి.మీ తెలంగాణ మణిహారంగా రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించబోతున్నామని, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి రేడియల్ రోడ్లు నిర్మించి నగరాన్ని మరింత అభివృద్ధి చేయనున్నామని ప్రకటించారు. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఓఆర్ఆర్‌కు అనుబంధంగా ముచ్చర్ల ప్రాంతంలో 40 నుంచి 50 వేల ఎకరాల్లో ప్రపంచంలోని అంతర్జాతీయ నగరాలకు ధీటుగా ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ట్యాంక్ బండ్‌ను మురికి కూపంగా మార్చారు. ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్ చేస్తానని ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. పదేళ్లలో నగరానికి కావల్సిన శాశ్వత అభివృద్ధిని గత ప్రభుత్వం విస్మరించిందని తప్పుపట్టారు. ఢిల్లీ నగరం పూర్తిగా కాలుష్యమయమైంది. ముంబైలో వరదలు వస్తే నివసించలేని పరిస్థితి, చెన్నైలోనూ వరదలు వస్తే గందరగోళ పరిస్థితి, బెంగుళూరులో గంటలకొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఇక >>2



## 'మహా' నేతలు ఆ ముగ్గురే

### సిఎంగా ఫడ్నవిస్

### డిప్యూటీలుగా షిండే, అజిత్

### ఆజాద్ మైదానంలో రేపే ప్రమాణం

**ముంబయి,డిసెంబరు 3:** కొత్తప్రభుత్వం ఏర్పాటుకు తొమ్మిదిరోజులపైగాజరిగిన జాప్యం ఎట్టకేలకు సద్దుమణిగింది. అధిష్టానం పంపించిన దూతలు రాయబేరాలు ఫలించాయి. గుజరాత్‌మాజీ సీఎం విజయ్ రూపాని, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లు నేతలతో వేరువేరుగా చర్చించిన మీదట ముఖ్యమంత్రిగా ఫడ్నవిస్, డిప్యూటి సీఎంలుగా అజిత్‌పవార్, ఏక్‌నాథ్‌షిండేలను సిఫారసుచేస్తూ హైకమాండ్‌కు లేఖలు పంపించారని నేతలు చెపుతున్నారు. ఇక కేబినెట్ ఫోర్టుఫోలియోల పైనా మహాయుతి నేతలకు >>2

# భవనాల అనుమతులకు 'బిల్డ్ నౌ'




### కొత్త విధానం అందుబాటులోకి

### రెరాతో అనుసంధానం, వచ్చే యేడాది ఫిబ్రవరి నుంచి అమలు

### సచివాలయంలో ప్రారంభించిన ఐటి మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా భవనాలు, లే అవుట్ల అనుమతులకు బిల్డ్ నౌపేరుతో కొత్త ఆన్‌లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకుని వచ్చింది. మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు బిల్డ్ నౌ పేరుతో ఏర్పాటు చేసిన విధానాన్ని సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రిశ్రీధర్‌బాబు ఈ విధానానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. బిల్డ్ నౌ కేవలం ఒక సాంకేతిక నవీకరణ మాత్రమే కాదని, ఇది ఆధునిక కాలంలో భవన నిర్మాణ అనుమ తులు పూర్తి స్థాయిలో ఎలా పనిచేయాలో చూపిస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతికతను కేంద్రీకృత వ్యవస్థతో మిలితం చేయడం ద్వారా తెలంగాణ ప్రజలు కేంద్రీకృత పరిపాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సర కాలంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ గతంలో లేని విధంగా రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతానికి పైగా జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉన్నందున ఈ శాఖ ప్రాధాన్యత దృష్ట్యా స్వయంగా ముఖ్యమంత్రి ఈ శాఖను స్వయంగా నిర్వహిస్తున్నారని అన్నారు. నూతన ఏకీకృత విధానంలో ఆన్‌లైన్‌లో భవన అనుమతి, లేఅవుట్‌కు ఆమోదించే వ్యవస్థను ప్రభుత్వం తీసుకుని వచ్చిందన్నారు. ప్రస్తుత వ్యవస్థలో డ్రాయింగ్ ఆటో స్క్రూటనీ కారణంగా ఎక్కువ ఆలస్యం జరుగుతుందన్నారు. అదేవిధంగా హై రైజ్ భవనాల విషయంలో డ్రాయింగ్ స్క్రూటనీకి చాలా సమయం పడుతుందన్నారు. దీని వల్ల వినియోగదారులకు దరఖాస్తుల సమయంలోనే ఎక్కువ సమయం వృథా అవుతుందన్నారు. ప్రస్తుత దరఖాస్తులు వివిధ వెండర్లు అభివృద్ధి చేసినట్లు, ఇన్‌స్టంట్ అప్రూవల్ ఒక వెండర్ ద్వారా మరియు సింగిల్ విండో మరొక వెండర్ ద్వారా చేయడం జరుగుతందని తెలిపారు. పౌరులు దరఖాస్తు సమర్పణ, స్టేటస్ ట్రాకింగ్, ఫీజు చెల్లింపు, అనేక విభాగాలతో కనెక్ట్ అవడం, మరిన్నింటి కోసం అనేక ప్లాట్‌ఫారమ్‌లను నావిగేట్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల గందరగోళం, జాప్యం జరుగుతుందన్నారు. భవన అనుమతులు, లేఅవుట్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, ట్రాన్స్ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ సర్టిఫికెట్లు జారీ చేయడం, అనధికార నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడం వంటి అన్ని ప్లానింగ్ సంబంధిత సమస్యలకు సింగిల్ పోర్టల్ ఉండటానికి నూతన దరఖాస్తు విధానాన్ని ప్రభుత్వం తీసుకురావాలని నిర్ణయించిందని, అందులో భాగంగా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. కొత్త దరఖాస్తు విధానం దేశంలోనే అత్యంత వేగవంతమైన డ్రాయింగ్ స్క్రూటనీ సాఫ్ట్‌వేర్‌ను కలిగి ఉందన్నారు. హైరైజ్ భవనాలకు సంబంధించి >>2

# ప్రభాకర్‌రావు వెనక్కి!

### భారత్‌కు అప్పగించేందుకు అమెరికా అంగీకారం!

### పదో తేదీ తర్వాత హైదరాబాద్‌కు రప్పించే అవకాశం

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం



**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కదలిక వున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో దాదాపు ఏడు నెలలకు పైగా ఎలాంటి పురోగతి లేక పోవడం తెలిసిందే. మొదట్లో అరెస్టయిన నలుగురు నిందితులు మినహాయించి అమెరికాకు ఉడాయించిన మొదటి నిందితుడు ఎస్ఐబి మాజీచీఫ్ ప్రభాకర్‌రావు మరో కీలక నిందితుడు మీడియా అధినేత శ్రవణ్ రావులను భారత్‌కు రప్పించేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటి వరకు కొలిక్కి రాకపోవడం విదితమే. అయితే ఈ విషయంలో పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు వారం రోజుల్లో ఫలితాలను ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభాకర్ రావును భారత్‌కు అప్పగించేందుకు అమెరికా అంగీకరించిందని వార్తలు వస్తున్నాయి. ఇదే విషయమై రాష్ట్ర సచివాలయంతో పాటు డిజిపి కార్యాలయంలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపైతమకు ఎలాంటి సమాచారంలేదని పోలీసు అధికారులంటున్నారు. రాష్ట్ర పోలీసు శాఖలో దుమారం రేపి, రాజకీయాల్లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మళ్లీ వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత మార్చి నెలలో వెలుగు చూసిన ఈ కేసులో ఎస్ఐబి నాటి డిఎస్పి దుగ్యాల ప్రణీత్ రావు, భూపాలపల్లి నాటి అదనపు ఎస్పీ భుజంగరావు, సిటీ సెక్యూరిటీ వింగ్ నాటి అదనపు డిసిపి తిరుపతన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి విశ్రాంత పోలీసు అధికారి రాధాకిషన్ రావులను నెల రోజుల వ్యవధిలో ఈ కేసును విచారించిన పశ్చిమ మండల పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించడం తెలిసిందే. ఇందులో భుజంగరావు అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌పై వుండగా మిగతా ముగ్గురు చంచల్‌గూడ జైల్లో వుండడం విదితమే. ఇక ఈ కేసులో మొదటి నిందితుడుగా వున్న ఎస్ఐబి నాటి చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు మీడియా అధినేత శ్రవణ్ రావులు ముందుగానే అమెరికాకు ఉడాయించడంతో వారిని పోలీసులు అరెస్టు చేయలేక పోయారు. ఈ కేసులో తాము ప్రభాకర్ రావు చెప్పినట్లే నడుచుకున్నామని అరెస్టయిన నలుగురు నిందితులు చెప్పారు. ఇదే సమయంలో నాటి సిఎం కెసిఆర్‌తో పాటు మంత్రి కెటిఆర్ సహా మరికొందరు బిఆర్ఎస్ నాయకుల పేర్లను >>2

## రాజధానిలో రూ.5,827 కోట్లతో

# అభివృద్ధి పనులు

### వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు3:** ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండిఏ గ్రౌండ్స్ నుంచి రూ.5,827 కోట్లతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు వర్చువల్‌గా ప్రారంభించారు. ఇఎం ప్రారంభించిన పలు అభివృద్ధి పనుల వివరాలు- జిహెచ్ఎంసి పరిధిలో హెచ్‌సిఐటిఐ ఫేజ్-1లో రూ.3,446 కోట్లఅభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఈ పనులకు పరిపాలనమంజూరు అయింది. హెచ్ఎండీ పరిధిలోని రహదారులు, జంక్షన్ల సుందరీకరణకు రూ.150కోట్లతో పనులకుశంకుస్థాపన చేశారు. వర్షపు నీటి సంరక్షణ, వరద నీటిని నియంత్రించే పనులకు రూ.17కోట్లఅంచనాలతో చేపట్టేపనులను సిఎం ప్రారంభించారు. జలమండలిఆధ్వర్యంలో నిర్మిం చిన మురుగు నీటినిశుద్ధి చేసే ప్లాంట్లు(సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు) ప్రారంభించారు. రూ.669 కోట్ల అంచనాలతో వీటిని ప్రభుత్వం చేపట్టింది. తాగునీటి సరఫరాకు అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ వివిధ ప్రాంతాల్లో రూ.45కోట్లతో చేపట్టిన 19రిజర్వాయర్లను సిఎం ప్రారంభించారు. హైదరా బాద్ రోడ్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసిఎల్) అధ్వర్యంలో గ్రేటర్ సిటీలో రూ.1,500 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసే ప్యాకేజీతో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న పనులకు శంకుస్థాపన చేశారు. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానంతో కొత్త ఆన్‌లైన్ బిల్డింగ్ అప్రూవల్, లేఅవుట్ అప్రూవల్ సాఫ్ట్ వేర్‌ను సిఎం లాంఛనంగా ప్రారంభించారు. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో ఫ్లైఓవర్లు అండర్‌పాసుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆరాంఘర్ బహుదూర్ పుర బారీ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించారు.




## మహిళా వర్సిటీ

# ఉన్నట్లా! లేనట్లా?

### 'జీవో' దగ్గరే ఆగిపోయిన విశ్వ'విద్యాలయం'

### ఇంకా అసెంబ్లీ చేరని సవరణ బిల్లు

### భవిష్యత్తుపై పిజి విద్యార్థుల ఆందోళన

### తుదుపరి చర్యలపై ఉన్నత విద్యామండలిని వివరాలు కోరిన ప్రభుత్వం

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత 8 సంవత్సరాలపాటు రాష్ట్రంలో మహిళా యూనివర్సిటీ లేకుండానే ఉన్నత విద్య కొనసాగింది. 8 సంవత్సరాల తరువాత రాష్ట్రంలో తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, ఏప్రిల్ 22న జీవో ఎంఎస్ నంబర్12ను జారీ చేసింది. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం (తెలంగాణ ఉమెన్స్ యూనివర్సిటీ) ఏర్పాటుకి సంబంధించి.. తాళం వేసితిని.. గొళ్లెం మరచితిని అన్నట్టుగా వ్యవహరించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. అదే విధానంలో ఇప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్ కూడా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న కోఠిలోని యూనివర్సిటీ మహిళా కాలేజీనే మహిళా విశ్వవిద్యాలయంగా కొనసాగించనున్నట్టు ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పేర్కొన్నారు. అయితే మహిళా వర్సిటీని ఏర్పాటు చేసిన తరువాత మౌలిక వసతులను సైతం ఏర్పాటు చేయలేదు. దాంతోపాటు ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి నిర్వహించాల్సిన కార్యక్రమాలను వేటిని కూడా ప్రభుత్వం ఇప్పటి వరకు కొనసాగించలేదు. దీంతో రాష్ట్రంలో మహిళా యూనివర్సిటీ పేరుకే ఏర్పాటు అయింది తప్ప అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఏమీ కూడా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. 2022లో తెలంగాణ మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు జీవో ఇచ్చినప్పటికీ.. అప్పటి నుంచీ అసెంబ్లీలో యూనివర్సిటీ సవరణ బిల్లు పెట్టకుండా మహిళా యూనివర్సిటీ ఏర్పాటుపై >>2

# మొబైల్ మాల్వేర్ దాడులకు టార్గెట్‌గా భారత్

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: సైబర్ నేరాలకు భారత్ కేరాఫ్‌గా మారిపోయిందని నిపుణులు హెచ్చరిస్తుండడం తెలిసిందే. విదేశాల్లో వుండే సైబర్ నేరగాళ్లు భారత్‌లోని లోకల్ నేరగాళ్లతో చెలిమి చేస్తూ అనేకరకాలుగా దోపిడీలకు పాల్పడుతుండడం విదితమే. ఇప్పటికే అనేకరకాల సైబర్ నేరాలు భారతీయ వణికిస్తుండగా ఇప్పుడు ఈ జాబితాలో మొబైల్ మాల్వేర్ దాడులు కూడా చేరిపోయాయి. ప్రపంచంలోనే అత్యధికంగా మొబైల్ మాల్వేర్ దాడులకు సంబంధించి 28 శాతం కేసులు భారత్‌లోనే నమోదవుతున్నాయని సైబర్ సెక్యూరిటీ వ్యవహారాల పర్యవేక్షించే అంతర్జాతీయ సంస్థ క్లౌడ్ సెక్యూరిటీ విడుదల చేసిన నివేదికలో తేటతెల్లమయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న మొబైల్ మాల్వేర్ దాడులు అమెరికాలో 27.3 శాతం వుండగా భారత్‌లో ఇది 28 శాతంగా వుందని ఆ సంస్థ పరిశీలనలో వెలుగు చూసింది. గత ఏడాది ఈ తరహా నేరంలో భారత్ మూడవ స్థానంలో వుండగా సైబర్ నేరగాళ్ల నేరాల పుణ్యమాని ఈ ఏడాది మొదటి స్థానానికి ఎగబాకింది. భారత్ లో వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటలైజేషన్ నేపథ్యంలో అనేక కంపెనీలు సైబర్ సెక్యూరిటీ పరంగా అప్‌డేట్ కాకపోవడం నేరగాళ్ల బరితెగింపుకు ప్రధాన కారణమని క్లౌడ్ సెక్యూరిటీ సంస్థ పేర్కొంది. భారత్‌లో మొబైల్ మాల్వేర్ దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో కంప్యూటర్లను ఆయా కంపెనీలు సైబర్ సెక్యూరిటీ నిపుణులతో చర్చించి మరింతగా భద్రంగా వుంచుకోవాల్సిన అవసరం వుందని క్లౌడ్ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఇక ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జరిగే మొబైల్ మాల్వేర్ దాడుల్లో 66.5 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయని ఆ సంస్థ పరిశీలనలో వెలుగు చూసింది భారత్‌లో కొన్ని ప్రైవేటు బ్యాంకులను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆ సంస్థ పేర్కొంది. ప్రైవేటు బ్యాంకులకు చెందిన వినియోగదారుల సెల్‌ఫోన్‌లను లక్ష్యం చేసుకుంటున్న నేరగాళ్లు మాల్వేర్ దాడులకు పాల్పడుతున్నారని ఆ సంస్థ పేర్కొంది. లాగ్ ఇన్ బ్యాంకింగ్ వివరాల వంటి సున్నితమైన సమాచారాన్ని దొంగిలించి వినియోగదారులను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు నకిలీ బ్యాంకింగ్ వెబ్‌సైట్‌లను వాడుతున్నారని ఆ సంస్థ నివేదికలో పేర్కొంది. దీంతో పాటు బ్యాంకుల సర్వర్లలో అక్రమంగా చొరబడడం, రహస్య సమచారాన్ని సేకరించి సెల్లుఫోన్లల్లో ఆన్‌లైన్ ఖాతాలను నేరగాళ్లు కోట్ల రూపాయలను కాజేస్తున్నారని ఆ సంస్థ పేర్కొంది.

**ప్రపంచంలోనే అత్యధికంగా 28 శాతం కేసులు మన దేశంలోనే..**

హైదరాబాద్‌లోని మహేష్ బ్యాంకు సహా రెండు జాతీయ బ్యాంకులు, మరో ప్రైవేటు బ్యాంకును సైబర్ నేరగాళ్లు మూడేళ్ల క్రితం ఇదే తరహాలో 25 కోట్ల రూపాయలకు పైగా లూటీ చేయడం తెలిసిందే.

## యాదాద్రి పవర్ 6న ప్రారంభోత్సవం

### తొలి యూనిట్ 800 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తి

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త : రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న నాలుగు వేల మెగా వాట్ల యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో తొలి యూనిట్ త్వరలో ప్రారంభం కానుంది. థర్మల్ పవర్ స్టేషన్‌లోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ తొలి యూనిట్‌ను ఈ నెల 6వ తేదీన ప్రారంభం చేయనున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమీక్షలో ఈ విషయం వెల్లడైంది. పవర్‌ప్లాంట్ యూనిట్ ప్రారంభోత్సవానికి జిల్లా అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. అయితే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాక షెడ్యూల్ ఇంకా ఖరారవ్వాల్సి ఉంది. కాగా రూ.30వేల కోట్లతో 4000 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిర్మాణ బాధ్యతలను బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు.5 ప్లాంట్ల పనులు అక్టోబర్ 2017లో ప్రారంభమయ్యాయి. 5,668ఎకరాలభూమి సేకరించగా, 4,676 ఎకరాలు అటవీ భూమి ఉంది.

## తొలి యేడాదిలో ఉద్యోగాల వెల్లువ

### మొత్తం నియామకాలు 54,520: సిఎంఒ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 3: ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే ఉద్యోగాల నియామకాల వెల్లువ పెద్ద ఎత్తున కొనసాగింది. మొత్తం నియామకాలు 54,520 జరిగాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి): 12,324. మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బి): 7,378, తెలంగాణ స్టేట్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు (టిజిపిఆర్‌బి): 16,067 తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ రిక్రూట్మెంట్ బోర్డు (టిఆర్ఈఐ-ఆర్‌బి): 8,304, డిఎస్‌సీ- పాఠశాల విద్య: 10,006, ఇతర సంస్థలు: 441, మొత్తం నియామకాలు: 54,520.

## పెద్దపల్లికి వరాల జల్లు

### రూ.413 కోట్ల పనులు మంజూరు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 3: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో యువ వికాసం వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వెళ్లనున్నారు. ఈ మేరకు ఆక్కడ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఆ ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ వరాలు కురిపించారు. పెద్దపల్లిలో రూరల్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తోపాటు ఎలిగేడు మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలిగేడుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ మంజూరు చేసింది.పెద్దపల్లిలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడేషన్. రూ.51 కోట్ల అంచనాలతో పరిపాలనా ఆమోదం. మంథనిలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.22 కోట్ల అంచనా వ్యయంతో ఉత్తర్వులు జారీ. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుమతి,పెద్దపల్లిలో ఫోర్ లేన్ బై పాస్ రోడ్డుతో పాటు రూ.352 కోట్లతో ఆర్అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు, రూ.10 కోట్ల అంచనాతో సబ్ స్టేషన్ల పనులు, రామగుండంలో నర్సింగ్ కాలేజీని ప్రారంభించనున్నారు.

## పుష్ప2 రిలీజ్‌కు లైన్‌క్లియర్

### విడుదలను ఆపలేమన్న హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త : తెలంగాణలో పుష్ప2 సినిమా విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. చివరి నిమిషంలో సినిమా విడుదలను ఆపలేమని హైకోర్టు స్పష్టం చేసింది. డైరెక్టర్ సుకుమార దర్శకత్వంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప2 సినిమా పాన్ ఇండియా లెవెల్ లో ఈ నెల 5న రిలీజ్ కానుంది. ఈ సినిమాకి టికెట్ రేట్లను పెంచుకునే విధంగా తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో తెలంగాణలో పుష్ప2 సినిమా టికెట్ చార్జీల పెంపును నిరసిస్తూ సినీ ప్రియులు హైకోర్టును ఆశ్రయించారు. బెన్ఫిట్ షోకు రూ.800 వసూలు చేస్తున్నారని ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన కోర్టు కీలక వ్యాక్యలు చేసింది. సినిమా విడుదలకు ఎక్కువ గడువు లేదని, చివరి నిమిషంలో సినిమా విడుదలను ఆపలేమని హైకోర్టు తెలిపింది. ఈ పిటిషన్ పై విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో తెలంగాణలో పుష్ప2 సినిమా విడుదలకు ఆటంకాలు తొలిగిపోయాయి.

## పెరిగిన వాణిజ్య పన్నుల రాబడి

### 8 నెలల్లో రూ.47,719 కోట్లు

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త : రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖ ఆదాయం నవంబర్ నెలలో భారీగా పెరిగింది. జీఎస్టీ రాబడితో పాటు పెట్రోల్, డీజిల్, లిక్కర్ అమ్మకాలపై వ్యాట్ ఆదాయంలోనూ వృద్ధి కనిపించింది. గత ఏడాది నవంబర్ రాబడి కంటే రూ.780 కోట్లు అదనంగా వచ్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గడిచిన ఎనిమిది నెలల్లో వాణిజ్య పన్నుల శాఖ నుంచి రూ.47,719 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.70,720 కోట్ల వాణిజ్య పన్నుల శాఖ ద్వారా ప్రభుత్వానికి సమకూరగా ఈ ఆర్థిక ఏడాదిలో రూ.85,112 కోట్లు రాబడి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు 8 నెలల్లో రూ.47,719 కోట్ల ఆదాయం వచ్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తెలిపారు. గతేడాదిలో ఎనిమిది నెలల రాబడితో పోలిస్తే దాదాపు రూ.2000 కోట్లు అధికమని వెల్లడించారు. నవంబర్ నెలలో అత్యధికంగా 14శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించారు. ఇక పెట్రోల్, డీజిల్ విక్రయాల ద్వారా వ్యాట్ రాబడి రూ.1,302 కోట్లు, మద్యం విక్రయాలపై వ్యాట్ ఆదాయం రూ.1,180 కోట్లు ప్రొఫెషనల్ ట్యాక్స్, పాత బకాయిలు కలిసి మొత్తం రూ.2,545.57 కోట్లు రాబడి వచ్చి పదిశాతం వృద్ధి నమోదు చేసింది. వ్యాట్, జీఎస్టీ రెండు కలిసి నవంబర్ నెలలో రూ.6249 కోట్లు ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇదే ట్రెండ్ కొనసాగినట్లయితే ఈ ఆర్థిక ఏడాదిలో రూ.72 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## జెఎన్‌టియుకు రూ. 108 కోట్లు మంజూరు

### ఉత్తర్వులు జారీ చేసిన బుర్రా వెంకటేశం

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం రూ. 108.60 కోట్లను మంజూరు చేశారు. నాన్ రికరింగ్ ఖర్చులో భాగంగా ఫేజ్-1లో నిధులను కేటాయిస్తూ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీలోని భవన నిర్మాణం, ప్రయోగశాల నిర్మాణం, మౌలిక సదుపాయాలు కొరకు జెఎన్‌టియు యునివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్. పాలేర్ కోసం నిధులు మంజూరు చేసింది. యూనివర్సిటీకి నిధులను కేటాయించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి వర్సిటీ రిజిస్ట్రార్ కె వేంకటేశ్వర్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

## హైడ్రాకు రూ.50 కోట్లు నిధులు

### ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు నిధులు విడుదల చేసింది. నగరంలో ప్రభుత్వ స్థలాలు, పార్క్‌ల పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ, విపత్తు నిర్వహణ కోసం పని చేస్తున్న హైడ్రాకు రూ.50 కోట్లను విడుదల చేస్తూ మంగళవారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైడ్రా కార్యాలయ నిర్వహణ, కొత్త వాహనాల కొనుగోలుతో పాటు ఇప్పటి వరకు కూల్చివేతలకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు ఈ నిధులు ఖర్చు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు బడ్జెట్‌లో హైడ్రాకు రూ.200 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, తాజాగా రూ.50 కోట్లు విడుదల చేయడంతో హైడ్రాకు ఆర్థికంగా మరింత బలం చేకూరనుంది.

## మావోయిస్టుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించండి

### పోలీసులను ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: ములుగు జిల్లా ఏటూరు నాగారం అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను వారి బంధువులు కోరితే అప్పగించాలని హైకోర్టు మంగళవారం నాడు ఆదేశించింది. ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌పై పౌర హక్కుల సంఘం నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం జరిగిన విచారణ మంగళవారం కూడా కొనసాగింది. ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాది ఎన్‌కౌంటర్ బూటకమం అని పౌర హక్కుల సంఘం నేతలు చెబుతుండడం సరైంది కాదని తెలిపారు. నక్సలైట్లపై ముందుగానే విష ప్రయోగం జరిగిందన డానికి ఆధారాలు లేవని ఆయన తెలిపారు. అయితే ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలను పౌర హక్కుల సంఘం తరపు న్యాయవాది ఖండించారు. ఒక పథకం ప్రకారం నక్సలైట్లపై ముందుగా విష ప్రయోగం చేసి, ఆనక వారిని అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసిన తరువాతే వారిని కాల్చి చంపారని ఆయన ఆరోపించారు. పౌర హక్కుల సంఘం తరపున వాదించిన న్యాయవాది వాదనలను సర్కారు తరపు న్యాయవాది తోసిపుచ్చారు. మావోయిస్టుల మృతదేహాలకు హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం నిపుణులైన వైద్యుల చేత పోస్టుమార్టం జరిగిందని, ఇందులో ఎవరికి అనుమానాలుంటే వాటిని చూడవచ్చని తెలిపారు. కాగా ఇదే ఘటనలో మరణించిన నక్సలైట్ మల్లయ్య సతీమణి ఐలమ్మ తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపిస్తూ మల్లయ్య ఒంటిపై తీవ్రంగా గాయాలున్నాయని, విష ప్రయోగం జరిగిందని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు మల్లయ్య మృతదేహాన్ని భద్రపరచాలని, మిగతా వారి మృతదేహాలు వారి బంధువులు కోరితే అప్పగించాలని ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది.

## గోదావరి, కావేరీ అనుసంధానంతో తరలించే

### 148 టిఎంసిల్లో సగం ఇవ్వాలి: తెలంగాణ

### 42 టిఎంసిలకు మించి ఇవ్వలేం: కేంద్ర జలశక్తి శాఖ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 3: గోదావరి కావేరీ నదుల అనుసంధానంతో తెలంగాణ అధిక భూభాగాన్ని కోల్పోతోందని, కాబట్టి తమకు నీటి వాటాలో ఎక్కువ ఇవ్వాలని తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జాతీయ జల అభివృద్ధి సంస్థ 74వ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, ఇంజినీర్లు వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ నుంచి చేపడుతున్నందున అధిక వాటా ఇవ్వాలన్నారు. గోదావరి,కావేరీ అనుసంధానంతో తరలించే 148 టీఎంసీల్లో సగం వాటా ఇవ్వాలన్నారు. అయితే ఇలా మళ్లించే నీటిలో 42 టీఎంసీలకు మించి నీటిని తెలంగాణకు ఇవ్వలేమని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. నీటి వాటా పంపిణీకి సంబంధించి రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ నెలాఖరున మరోసారి సమావేశం నిర్వహించాలని కేంద్ర జలవరుల శాఖ భావిస్తోంది.

# ఆర్టీసీ మరో బంపర్ ఆఫర్

### వివాహాలు, శుభకార్యాలకు ముందుగా బుక్ చేస్తే భారీ రాయితీ

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మరో బంపర్ ఆఫర్ ప్రకటించింది. వివాహాలు, శుభ కార్యాలకు అడ్వాన్స్‌గా బస్సులు బుకింగ్ చేసుకుంటే భారీ తగ్గింపుతో రాయితీని అందించనున్నట్లు వెల్లడించింది. ఆర్టీసీ ప్రకటించిన ఈ ఆఫర్‌తో ప్రయాణికులకు భారీగా ఆదా కలగడంతో పాటు సంస్థకు భారీగా ఆదాయం పెరుగుతుందని ఆ సంస్థ అధికారులు ఆశిస్తున్నారు. ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీజీఆర్టీసీ అధికారులు తెలిపారు. కాగా, గతంలో వివాహాలు, శుభ కార్యాలకు ముందుగా బస్‌లను బుక్ చేసుకుంటే పల్లె వెలుగుకు అద్దె కి.మీ.కు 68 వసూలు చేస్తుండగా, ఆ చార్జీని ఇప్పుడు రూ.52కు తగ్గించారు. అలాగే, ఎక్స్‌ప్రెస్ చార్జీలు కి.మీ.కు రూ.69 ఉండగా దానిని 62కు తగ్గించారు. డీలక్స్ బస్సు చార్జీలు రూ.65 నుంచి 57కు, సూపర్ లగ్జరీ బస్సు అద్దెను రూ.69 నుంచి 59కి తగ్గించారు. టీజీ ఆర్టీసీ తీసుకున్న ఈ కొత్త నిర్ణయం ప్రయాణికులకు భారీ ఊరట కలిగిస్తుందనీ, పెళ్లిళ్ల, టూర్ల కోసం ప్రత్యేకంగా బస్సులు అద్దెకు తీసుకునే వారు ఈ తగ్గింపు ద్వారా ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.దీంతో ప్రయాణాలకు టీజీ ఆర్టీసీ సేవలను ఉపయోగించుకునే వారి సంఖ్య భారీగా పెరగడంతో పాటు తక్కువ చార్జీతో ఎక్కువ సౌకర్యాలను పొందే అవకాశం ఉంటుందని టీ ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు సంస్థకు సైతం అతి తక్కువ సమయంలో భారీ రాయితీ కారణంగా అధిక ఆదాయం వస్తుందని టీ ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. కాగా, ఈ ఆఫర్ వివాహాల సీజన్ ముగిసే వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉండనుంది.

## అలప్పుజలో ఆర్టీసీ బస్సు, కారు ఢీ

### ఐదుగురు మెడికోల మృతి



అలెప్పీ, డిసెంబరు 3: ఐదుగురు వైద్య విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు కేరళ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఐదు గురు విద్యార్థులు అక్కడికక్కడే మరణించారు. వేగంగా వస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీకొనడం తో మొత్తం కారు నుజ్జు నుజ్జయింది. మృతులు అందరూ కూడా ఎంబిబిఎస్ చదువుతున్నవారే. అయితే వీరిని ఎప్పటికప్పుడు గుర్తించలేక పోయారని, కళాశాల విద్యార్థులు కొందరుగుర్తుపట్టినట్లు తెలిపారు. ఏడుగురు వ్యక్తులు కారులో ఉంటే వారిలో ఐదుగురు తీవ్ర గాయాలతో చనిపోయినట్లు తేలింది. బస్సులోని ప్రయాణీకులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఈప్రమాదంతో వాహన ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రమాదానికి గల కారణంపై పోలీసులు ఆరాతీస్తున్నారు.

# రైల్లో కర్పూరం వెలిగించకండి

### శబరిమల భక్తులకు రైల్వే శాఖ సూచనలు



హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 3, ప్రభాతవార్త: శబరిమల వెళ్లే భక్తులకు దక్షిణ మధ్యరైల్వే అధికారులు మంగళవారం పలు కీలక సూచనలు ఇచ్చారు. భద్రత దృష్ట్యా రైళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని, కర్పూరం వెలిగించవద్దని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా రైళ్ల కోచ్‌ల లోపల పూజా విధానంలో భాగంగా కర్పూరం వెలిగించడం, హారతి ఇవ్వడం, అగరు బత్తులు, సాంబ్రాణి పుల్లలు వెలిగించడం వంటివి చేస్తున్నట్లు రైల్వే అధికారుల దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమాలను రైళ్లలో చేయవద్దని ప్రయాణికులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. యాత్రికుల సౌకర్యార్థం దక్షిణ మధ్యరైల్వే శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్ల జోన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడ, తిరుపతి, నాందేడ్ తదితర స్టేషన్ల నుంచి బయలుదేరి మార్గ మధ్యలో పలు స్టేషన్లలో ఆగుతాయని అదికారులు చెప్పారు. ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణించే వారు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరేందుకు దక్షిణ మధ్యరైల్వే ప్రయాణికుల సహకారం కోరుతున్నట్లు చెప్పారు. రైళ్లలో రైలు ప్రాంగణాల్లో ఎలాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని విజ్ఞప్తి చేస్తున్నారు. మండే స్వభావంగల పదార్థాలతో ప్రయాణం చేయడం, వాటిని ఏ రూపంలో నైనా వెలిగించడం నిషేధించినట్లు రైల్వే శాఖ పేర్కొంది. మండే స్వభావంగల పదార్థాలతో అగ్ని ప్రమాదాలకు దారితీసి మానవ ప్రాణాలకు ముప్పు కల్గించడమే కాకుండా రైల్వే ఆస్తులకు సైతం నష్టం కల్గించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇలాంటి చర్యలు రైల్వే చట్టం 1983లోని సెక్షన్లు 67,154, 164,165 ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతాయని స్పష్టం చేస్తోందన్నారు. ఇటువంటి చర్యల వల్ల జరిగిన నష్టానికి బాధ్యత వహించడంతో పాటు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

## లగచర్ల ఘటన నిందితులకు బెయిల్ నిరాకరణ

### ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని వికారాబాద్ కోర్టు సూచన

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలోని నిందితులకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌ను మంగళవారం వికారాబాద్ జిల్లా కోర్టు నిరాకరిం చింది. లగచర్ల ఘటనలోని నిందితులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ, బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు నవంబర్ 14వ తేదీన వికారాబాద్ జిల్లా కోర్టులో 5 పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విషయమై నాలుగుసార్లు వాదనలు సైతం బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు వినిపించినట్లు తెలిపారు. మంగళవారం బెయిల్ పిటిషన్‌పై వికారాబాద్ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా, బెయిల్ నిరాకరిం చారని బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన అంశము అయినందున తమ పరిధిలోకి రాదని, తాము బెయిల్ ఇవ్వలేమని వికారాబాద్ కోర్టు స్పష్టం చేసింది. ఈ విషయమై ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని బెయిల్ పిటిషన్ దారులకు వికారాబాద్ కోర్టు సూచించినట్లు బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు తెలిపారు.

# ఒక్క నవంబర్‌లో రూ. 32.96 కోట్ల ఆదాయం

### తెలంగాణలో రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగింది: సిఎంఒ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 3:నవంబర్ నెలలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో పాటు రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 32.96 కోట్ల ఆదాయం పెరిగింది.ఈ మేరకు మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. గత ఏడాది 2023 నవంబర్ లో 1,05,235 డాక్యుమెంట్ల ద్వారా 1127.79 కోట్ల ఆదాయం వస్తే.. ఈ నవంబర్ నెలలో 1,19,317 డాక్యుమెంట్ల ద్వారా రూ. 1160.75 కోట్ల ఆదాయం సమకూరింది.అప్పటితో పోలిస్తే డాక్యుమెంట్ల సంఖ్య 13.38 శాతం పెరిగింది. ఆదాయం 2.92 శాతం పెరిగింది. హెచ్ఎండీఏ పరిధిలో సానుకూల వృద్ధి నమోదైంది.ఈ నెలలోనే 625 డాక్యుమెంట్లతో రూ.21.09 కోట్ల ఆదాయ వృద్ధిని సాధించింది. నాన్ హెచ్ఎండీఏ ప్రాంతంలో 3513 డాక్యుమెంట్లతో రూ.202.78 కోట్ల ఆదాయం సమకూరింది. వాణిజ్య సముదాయాలతో పోలిస్తే గృహాలు, నివాస సముదాయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ఆదాయంలో ఎక్కువ వృద్ధి నమోదైంది.

## 6న పద్మావతి అమ్మ పంచమీతీర్థం

### సాఫీగా ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లు



తిరుమల,డిసెంబర్ 3ప్రభాత వార్తప్రతినిధి: పట్టపురాణి తిరు చానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి కార్తీకబ్రహ్మోత్స వాల్లో ఎంతో విశిష్టమైన అమ్మ వారి పంచమీతీర్థం ఘట్టం 6వతేదీ శుక్రవారం జరగనుంది. ఈ చివరిఘట్టంలో పవిత్రమైన పుష్కరిణి స్నానాలకు భక్తులు తిరుపతి,తిరుచానూరు పరిస రాల్లోనుండేగాక తమిళనాడు, నెల్లూరు జిల్లా వాసులు భారీగా తరలివస్తారు. ఈ కారణంగా భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ ఏర్పాట్లను మంగళవారం ఉదయం టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, టిటిడి సిఇ సత్యనారాయణ, ఎప్ఎసిఎఒ బాలాజీ, ఎస్ఇ జగదీశ్వర్‌రెడ్డి, విజిఒ సదాలక్ష్మి ,ఎవిఎస్ఒ సతీష్‌కుమార్ పరిశీలించారు. పుష్కరిణిలోకి ప్రవేశించేందుకు క్యూలైన్లు, హోల్డింగ్ ప్రాంతాలతోబాటు ప్రవేశ,నిష్క్రమణ పాయింట్లు పరిశీలించారు. పంచమీతీర్థం పుణ్యఘడియలు రోజంతా ఉండటంతో భక్తులు ఎక్కడా ఆతృతపడకుండా ప్రశాంతంగా పుణ్యస్నానాలా చరించాలన్నారు. పుష్కరిణిలో 12వేలమంది భక్తులు ఒక్కసారిగా పుణ్యస్నానాలాచరించే అవకాశం ఉందన్నారు.

# అప్పుగా ఇచ్చిన డబ్బులు అడిగితే దారుణ హత్య

### గొంతుకోసి హత్యచేసిన స్నేహితుడు!



కాశీరావు (ఫైల్)



నిందితుడు శేఖర్

హైదరాబాద్ (హయత్‌నగర్), డిసెంబరు 3, ప్రభాతవార్త: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడగడానికి వెళ్లిన వ్యక్తిని స్నేహితుడే గొంతుకోసి హత్యచేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, మృతుడి భార్య కథనం ప్రకారం వివరాలు... ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం దోనకొండ గ్రామానికి చెందిన యక్కలి కాశీరావు(37) హయత్‌నగర్ డివిజన్ భాగ్యలత అరుణోదయ కాలనీలో నివాసముంటూ కార్ల వ్యాపారం (సెకండ్‌సేల్స్) నిర్వహిస్తుం టాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అదే ఇంటిపై మొదటి అంతస్తులో రెండేళ్లుగా పెద్దగాని శేఖర్, పెద్దగాని సాయి, ఐతరాజు శంకర్‌లు సింగిల్‌బెడ్‌రూంని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారిలో సాయి, శంకర్‌లు మన్సూరాబాద్ డివిజన్ వినాయక్‌నగర్ కాలనీ ఫేజ్-2 సమీపంలోని బొమ్మలగుడి దగ్గర ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. శేఖర్ ఏడాదిగా కాశీరావుతో కలిసి కార్ల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఇరువురి మధ్య స్నేహం, వ్యాపార లావాదేవీలు బాగానే నడుస్తున్న క్రమంలో కాశీరావు నుంచి శేఖర్ మే 2023లో 3.60 లక్షల రూపాయలు, జూన్‌లో 1.50 లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. కొద్దిరోజుల తరువాత తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో శేఖర్‌ను కాశీరావు నిలదీశాడు. ఈక్రమంలో ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి.

ఈనెల 3న ఉదయం సుమారు 9 గంటల సమయంలో సాయి, శంకర్‌లు తమ ఇంటినుంచి బయటకు వెళ్లిన తరువాత శేఖర్‌ను డబ్బులు అడగడానికి కాశీరావు అతని గదికి వెళ్లాడు. దాదాపు గంటన్నర తరువాత శేఖర్ తన గదినుంచి బయటకు కిందకు వెళ్తూ... నీభర్తను చంపి వేశానంటూ అక్కడ దుస్తులు ఆరవేస్తున్న కాశీరావు భార్య సుమలతకు చెప్పి అక్కడి నుంచి పరార య్యాడు. షాక్‌కు గురైన సుమలత పైఅంతస్తులోని శేఖర్ గదిలోకి వెళ్లి చూడగా... కాశీరావు మెడపై బలమైన గాయమై రక్తపు మడుగలో పడిఉన్నాడు.

అతన్ని లేపడానికి యత్నించగా అప్పటికే చనిపోయినట్లు గుర్తించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమిని అడిగినందుకే తనభర్తను శేఖర్ హత్యచేశాడని సుమలత చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. కాశీరావు హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమా... లేక ఇతర వివాదాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. LTD.
ఆపరేషన్ డివిజన్, కీసర
టెండర్ ప్రకటన నం. 03/2024-25
కీసర డివిజన్‌లో వేసవి కార్యాచరణ ప్రణాళిక మరియు ఇతర పనులకు వివిధ కాంట్రాక్టర్ల నుండి సీల్ టెండర్లు కోరబడుతున్నవి. ఈ విధంగా : i) కీసర సెక్షన్ : Spec No. 5,6,8,9,10,11 (GEN) ii) నాగారం సెక్షన్ : Spec No. 15 (GEN) iii) బాలాజీ నగర్ సెక్షన్ : Spec No. 12 & 13 (GEN) iv) ఘట్‌కేసర్ సెక్షన్ : Spec No. 16 (ST) 17, 18, 19, 20, 22 (GEN) v) నారపల్లి సెక్షన్ : Spec No. 24, 25, 26 (GEN) vi) పీర్జాదిగూడ సెక్షన్ : Spec No. 21 (SC), 28 (SC), 27 (GEN) vii) మేడిపల్లి సెక్షన్: Spec No. 7 (SC), 14 (SC), 23 (GEN) viii) ఘట్‌కేసర్ సబ్ డివిజన్ : Spec No. 29, 30 (GEN). పై టెండర్ల యొక్క విక్రయానికి చివరి తేదీ: 12.12.2024 సా.17.00గం. వరకు. తదుపరి వివరాలు డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం/OP/కీసర ఫోన్ నం. 7901093671 నుండి పొందవచ్చును.
సం/-. డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్, కీసర-TGSPDCL.
DIPR.NO. 7419-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 03.12.2024

వార్త


మనకుగల శక్తిని బట్టి మనలను మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనలను అంచనా వేస్తారు.

న-జేన్ పోర్టర్

# మద్యాన్ని మట్టుపెట్టలేమా?

మద్యం వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ఎన్ని లక్షల కుటుంబాలు ఈ మద్యం రక్కసి కోరల్లో చిక్కుకొని చితికిపోతున్నాయో పాలకులకు తెలియందికాదు. అయినా పాలకులు ఈ వ్యాపారాన్ని వదిలిపెట్టలేకపోతున్నారు. మరొకపక్క ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రచారంచేసుకుంటున్నారు. ఇంకొక పక్క మద్యాదాయమే మహాప్రసాదంగా భావించే దురదృష్టపు రోజులు కొనసాగుతున్నాయి. దేశంలో పెరుగుతున్న నేరాలకు, ఘోరాలకు ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు మద్యమే ఈ ప్రధాన కారణాల్లో ఒకటనేది కాదనలేని వాస్తవం. మానవ జాతిని పట్టిపీడిస్తున్న ఈ రక్కసిని పారద్రోలేందుకు గతంలో ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. మహాత్ముడు జాతికి అందించిన అమృత సందేశం ఈ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించివేయాలనేది. ఒకపక్క లక్షలాది కోట్లరూపాయలు ప్రజాసంక్షేమం, అభ్యున్నతి, ఆరోగ్యం కోసం నీళ్లలా ఖర్చుపెడుతూ మరొక పక్క మద్యం సేవించి ఆరోగ్యం పాడయ్యేవిధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తే ఎవరిని నిందించాలి. ఇదంతా ఒక ఎత్తైతే మద్యం మత్తులో జరుగుతున్న నేరాలు, ఘోరాలు అన్నీఇన్నీకావు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు తదితర నేరాల్లో నిందితుల్లో తొంభైశాతంపైగా మద్యం మత్తులో ఉన్నవారే. ఢిల్లీలో జరిగిన నిర్భయ కేసులో కానీ, ఆ తర్వాత హైదరాబాద్ శివారులో జరిగిన దిశ హత్యాచారం కేసులో కానీ నిందితులు మత్తులో తూలుతున్నవారే. మద్యం మత్తులో కన్నుమిన్నకానక తల్లి పైనే అఘాయిత్యానికి పాల్పడుతున్న తనయుడు, అలాగే కుమార్తెలపై లైంగిక దాడికి ఒడిగడుతున్న తండ్రులు ఇలాంటి కిరాతక చర్యలకు ఒడిగడుతున్నారే విషయం ఎన్నోసార్లు బయటపడింది. న్యాయస్థానాలు కూడా శిక్షలు వేశాయి. ఇదంతా ఒక ఎత్తైతే ప్రమాదాలవిషయం చెప్పక్కర్లేదు. దేశవ్యాప్తంగా కానీ, ఇటు రాష్ట్రాల్లో కానీ జరుగుతున్న ప్రమాదాల్లో అధికశాతం మద్యం మత్తుకు సంబంధించినవే. మద్యంమత్తులో వాహనాలు నడుపుతూ అన్నెంపున్నెం ఎరుగని అమాయకులను బలి తీసుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్ నగరంలో మద్యంమత్తులో ఒక యువకుడు కారు నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో భార్యాభర్తలు ఇద్దరు మృతిచెందారు. వికారాబాద్ జిల్లా దోమమండలం మోత్కూర్‌కు చెందిన ప్రణిత్ అనే యువకుడు హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితులను కలిసేందుకు శనివారం అర్థరాత్రి పూర్తి మైకంలో కారు నడుపుతూ ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. స్థానిక ప్రజలు పట్టుకొని చితకకొట్టారు. వారి నుంచి ఎలాగో తప్పించుకొని అతివేగంగా వస్తూ మరొక ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు చెప్పారు. ఆ ద్విచక్ర వాహనంపై తమ ఇద్దరి పిల్లలకు ఆహారాన్ని తీసుకువచ్చేందుకు వెళ్తున్న దినేష్, మోనతాకూర్ దంపతులు మరణించారు. ఆహారం కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు పిల్లలు అనాథలైపోయారు. ప్రణిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని శ్వాస పరీక్షలు నిర్వహించగా పూర్తి మైకంలో ఉన్నట్లు చెప్తున్నారు. ఏదిఏమైనా ఆ ఇద్దరు పిల్లలు అనాథలుగా మారిపోయారు. మద్యం మత్తులోవాహనాలు నడుపు తూ అన్నెంపున్నెం ఎరుగని అమాయకులను బలి తీసు కుంటున్నారు. లక్షలాది కుటుంబాల్లో చిచ్చుపెడుతున్నారు. హైదరాబాద్ నగరంలో చూసినా యువతమద్యం మత్తులో తూలుతూ మితిమీరిన వేగంతో ఎంతమందిని పొట్టనపెట్టుకున్నారో, ఎన్ని కుటుంబాల్లో చిచ్చుపెట్టారో చెప్పక్కర్లేదు. ఆ కుటుంబాలు దుఃఖ సాగరం నుంచి యేళ్ల తరబడి కోలుకోలేకపోతున్నారు. ఎవరు ఎన్ని సంతాపాలు జరిపినా, ఓదార్పు మాటలు చెప్పినాపోయిన ప్రాణాలు తిరిగి రావు. ఆ మధ్య హైదరాబాద్‌లో పనితో అలసిపోయి రోడ్డుపక్కనే ఉన్న చిన్న షాపులో నిద్రిస్తున్న యువకుడిని తాగిన మత్తులో కారునడిపి పొట్టన పెట్టుకున్నాడు మరొక యువకుడు. భర్తను కోల్పోయిన ఆ ఇల్లాలి దుఃఖంమాటల్లో తీర్చగలమా? అంతకుముందు ఒకసారి ఇంటిముందు కూర్చొని సరదాగా ముచ్చటించుకుంటున్న కుటుంబంపై మద్యం మత్తులో ఒక వాహనం దూసుకువెళ్లి నలుగురి మరణానికి కారణమైంది. ఇకఎన్ని లక్షల మంది అనారోగ్యం పాలవుతున్నారో పాలకులకు తెలియందికాదు. ఇన్ని అనర్థాలకు మూలమైన మద్యాన్ని పారద్రోలేందుకు పాలకులకు మనసు ఒప్పుకోకపోవడం దురదృష్టకరం. మద్యపాన నిషేధం అమలులో ఆచరణలో ఎన్నో కష్టాలున్నాయని, ప్రధానంగా పొరుగునున్న రాష్ట్రాల్లో నిషేధించకుండా తెలుగు రాష్ట్రాల్లో నిషేధిస్తే ఆశించిన ప్రయోజనం నెరవేరదనేది ఒక వాదన. అక్కడి నుంచి మద్యం వ్యాపారులు నిషేధించిన రాష్ట్రానికి మద్యాన్ని తరలించవచ్చు. కానీ ఇది ఎక్కడో ఒక దగ్గర మొదలు కావాలి. ఇప్పటికే బీహార్ లాంటి రాష్ట్రాల్లో మద్య నిషేధం అమలు అవుతున్నది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోయి స్తోమత ప్రభుత్వాలకు లేదని కొన్ని రాష్ట్రాల పెద్దలు చెప్తున్నారు. జూదం, వ్యభిచారం, మత్తుపదార్థాలు, లాటరీ లాంటివి ప్రభుత్వ ఆదాయ వనరులు కారాదని రాజ్యాం గంలోని నలభై ఏడవ నిబంధన స్పష్టం చేస్తున్నది. ఈ నిబంధనను కొట్టివేయించేందుకు కొందరు మద్యం వ్యాపారులు 1978లోనే దేశ అత్యున్నత న్యాయస్థానంలో వ్యాజ్యం వేశారు. వాదోపవాదాలు విన్న సుప్రీంకోర్టు మద్యపాన నిషేధాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది. అటు రాజ్యాంగాన్ని, ఇటు న్యాయస్థానాల ఆదేశాన్ని పాటించకుండా ఆదాయమే ధ్యేయంగా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరం.

నిన్నటి తప్పుల గురించి కాని రేపు రాబోయే కష్టం గురించి కాని దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.



మహాత్మాగాంధీ

నీ కోసం వచ్చే వ్యక్తుల కోసం నిర్దిష్ట సమయం పాటించక పోవడమంటే అది నీ నిజాయితీ లేనితనానికి నిదర్శనం.



రామకృష్ణ పరమహంస

# పశ్చిమాసియాకు ప్రశాంతత చేకూరేనా!

**దేశంలో పరిస్థితులు అంత యుద్ధానికి దారితీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒప్పందాన్ని అమలు చేయడానికి సైనిక మొహరింపు అనేది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కనుక లెబనాన్ ఆర్థికంగా ఇబ్బంది కలగవచ్చు. ఒకవేళ లెబనాన్ సైన్యం గనుక ఈ ప్రాంతంలో నియంత్రణ తీసుకోకపోతే ఎప్పటికీ హెజ్బుల్లా ప్రభావమే ఉంటుంది. కాబట్టి హెజ్బుల్లా ఇప్పుడు బలహీనంగా ఉన్నది. సైన్యం సునయాసంగా ఈ ప్రాంతంపై నియంత్రణ సాధించవచ్చు అంటున్నారు విశ్లేషకులు. ఒప్పంద ఉల్లంఘనలు జరగకుండా పర్యవేక్షి ంచడానికి అమెరికాశాంతి పరిరక్షక దళం (యూనిఫిల్), లెబనాన్, ఇజ్రాయిల్ ఫ్రాన్స్‌లు కలిసి సంయుక్తంగా కాల్పుల విరమణ ఒప్పందం సక్రమంగా జరిగేలా చూస్తాయి.**

డాక్టర్ కావలి చెన్నయ్య

లెబనాన్‌లో ఎక్కువగా కేంద్రీకృతమైన హెజ్బుల్లా తీవ్రవాద సంస్థ, పాలస్తీన తీవ్రవాద సంస్థ హమా సుకు మద్దతిస్తుందన్న కారణం చేత హెజ్బుల్లాపై ఇజ్రా యిల్ దాడి చేయడం వల్ల లెబనాన్‌లో సుమారు 4000 మంది దాడులలో మరణించారు. 15వేలమంది గాయపడ్డా రు. యుద్ధపీడన చేత గూడు విడిచి దారితెలియక దాదాపు 12 లక్షల మంది ముఖ్యంగా దక్షి ణ లెబనాన్ ప్రజలు సురక్షి త ప్రాంతాలకు తరలివెళ్లారు. వారు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కొందరు యూరప్ దేశాల, అరబ్బు దేశాల నాయకులు నిరంతర కృషి ఫలితంగా ఇజ్రాయిల్, హెజ్బు ల్లా మధ్యలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గత బుధవారం ఉదయం నుండి అమలులోకి వచ్చిన సందర్భం గా తిరిగి తమ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. గత కొన్ని నెలల నుండి దాడులు ప్రతి దాడులతో ఆ ప్రాంతం దద్దరి ల్లింది. ఇప్పుడు కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఇజ్రాయిల్ 2 నెలలలో తన దళాలను లెబనాన్ నుండి ఉపసంహరిం చుకుంటుంది. కాల్పుల విరమణ ఒప్పందం ఎంతకాలం అమలులో ఉంటుందనేది హెజ్బుల్లాపైఆధారపడి ఉంటుంది. ఒకవేళ హెజ్బుల్లా గనుక మళ్లీ ఇజ్రాయిల్ మీద, ఇజ్రాయిల్ పౌరుల మీద గాని దాడి చేస్తే విజయం సాధించే వరకు యుద్ధాన్ని ఆపబోమని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్‌నెత న్యాహు ప్రకటించారు. ఈ ఒప్పందంలో కీలకంగా వ్యవహ రించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మెక్రాన్ స్పందిస్తూ ఇజ్రాయిల్ లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని అన్నాడు. గాజాలో కూడా కాల్పుల విరమణ అమలు చేయ డానికి, హమాస్ చెర నుండి ఇజ్రాయిల్ బందీలను విడిపిం చడానికి ఈజిప్ట్, ఖతర్, తుర్కియేలతో చర్చిస్తామనిఅమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించాడు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటొని యో గుటెరస్ స్వాగతించాడు. ఇరాన్ పై పూర్తిస్థాయి దృష్టి సారించిందుకే హెజ్బుల్లాతో ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నదని విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. భారతదేశం సైతం కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగ తిస్తూ విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. గాజాలో ఇజ్రాయిల్ హమాస్ తీవ్రవాదులపై చేస్తున్న దాడు ల ప్రతిదాడుల వల్ల సుమారుగా 44 వేలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు1,04,000మంది ప్రజలు గాయపడ్డారు. గాజాలో ఇంకా దాడులు ప్రతిదాడులు కొన సాగుతున్నాయి. సామాన్య ప్రజలకు కనీస అవసరాలైన కూడు గూడు కరువైంది. పాఠశాలలు, ఆసుపత్రులు చాలా మటుకు ధ్వంసం చేయబడ్డాయి. కన్న తల్లిదండ్రుల కండ్ల ముందే వారి పిల్లలు చంపబడుతున్నారు. పిల్లల కళ్లముందే వారి తల్లిదండ్రులు చంపబడుతున్నారు. గాయపడుతున్నారు, వికలాంగులు అయిపోతున్నారు. దిక్కుతోచని స్థితిలో దిగా దీనంగా సహాయం కోసమే ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో కనీసం లెబనాన్ ప్రజలకైనా ఈ ఒప్పందం వల్ల మేలు జరుగుతుంది. 60రోజులలో హిజ్బొ ల్లా బ్లూలైన్ (లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య అనధికారిక సరి హద్దు), లిటాని నదికి (ఉత్తరదిశకు సుమారు 30 కి.మీ దూరం) మధ్య ఉన్న భూభాగంనుండి తన పోరాటయోధు లను, ఆయుధాలను ఉపసంహరిస్తుంది. అమెరికా సీనియర్ అధికారి అభిప్రాయంప్రకారం లెబనాన్ సైన్యం ఆప్రాంతాన్ని తన ఆధీనంలోకి తీసుకుంటుంది. ఆయుధాలు, సైనిక నిర్మాణాలు తొలగిస్తారు, వాటిని మళ్లీ అక్కడ పునర్నిర్మించ కుండా చూసుకుంటాయి. అదే 60 రోజులలో ఇజ్రాయెల్ నెమ్మదిగా తన సైన్యాన్ని, ప్రజలను అక్కడి నుంచి ఉప సంహరించుకుంటుంది. సరిహద్దుకు ఇరువైపులా ఉన్నప్రజలు తమ ఇళ్లకు తిరిగి రావడానికి ఇది వీలు కల్పిస్తుందని బైడెన్ చెప్పారు. అమెరికా అధికారి ప్రకటన ప్రకారం



దక్షి ణాన హిజ్బుల్లా స్థానంలో ఐదు వేలమందితో కూడిన లెబనాన్ సైన్యాన్ని మోహరించడం ఈ ఒప్పందంలో ఉంది. ఇక్కడ గమనించాల్సి న విషయం లెబనాన్ దక్షిణ ప్రాంతంలో హెజ్బుల్లా ప్రభావం గణనీయంగా ఉంటుంది. ప్రాంతంలో షియా ప్రజలు కూడా గణనీయంగా ఉంటారు. ఈ తీవ్రవాద సంస్థ కూడా షియా ప్రేరేపిత షియా సభ్యులు గల సంస్థ. దీనికి ఇరాన్ నుండి పెద్ద మొత్తంలో ఆర్థిక, ఆయుధాలు అందుతాయి. కాబట్టి ఆ ప్రాంతంలో లెబనాన్ సైన్యాన్ని ఎంతవరకు అంగీకరిస్తుంది అనేది సంశయం. ఒప్పందాన్ని అమలుచేయడంలో భాగంగా సైన్యానికి, ఈ తీవ్రవాదసంస్థకు ఘర్షణ తలెత్తవచ్చు. అలాంటప్పుడు దేశంలో పరిస్థితులు అంత యుద్ధానికి దారితీసే అవకాశాలు ఎక్కువగా ఉంటా యి. ఒప్పందాన్ని అమలు చేయడానికి సైనిక మొహరింపు అనేది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కనుక లెబనాన్ ఆర్థికంగా ఇబ్బంది కలగవచ్చు. ఒకవేళ లెబనాన్ సైన్యం గనుక ఈ ప్రాంతంలో నియంత్రణ తీసుకోకపోతే ఎప్పటికీ హెజ్బుల్లా ప్రభావమే ఉంటుంది. కాబట్టి హెజ్బుల్లా ఇప్పుడు బలహీనంగా ఉన్నది. సైన్యం సునయాసంగా ఈ ప్రాంతంపై నియంత్రణ సాధించవచ్చు అంటున్నారు విశ్లేషకులు. ఒప్పంద ఉల్లంఘనలు జరగకుండా పర్యవేక్షి ంచడానికి అమెరికాశాంతి పరిరక్షక దళం (యూనిఫిల్), లెబనాన్, ఇజ్రాయిల్ ఫ్రాన్స్ లు కలిసి సంయుక్తంగా కాల్పుల విరమణ ఒప్పందం సక్రమంగా జరిగేలా చూస్తాయి. పాలస్తీనా గాజా స్ట్రిప్ 2007నుండి హమాస్ తీవ్రవాదసంస్థ పాలిస్తుంది. అయితే వెస్ట్‌బ్యాంక్ ఫథా నేతృత్వంలోని పాలస్తీనియన్ అథారిటీ పాలనలో ఉంది. 2023లో అందిన లెక్కల ప్రకారం పాలస్తీ నాలో 81శాతంప్రజలు పేదరిక స్థాయికి దిగువన ఉన్నారని మరో 63 శాతంప్రజలు ఆహార భద్రత లేక అంతర్జాతీయ సహాయానికై ఎదురు చూస్తుంటారని తెలుస్తుంది. మత, భౌగోళిక పరంగా చూసినప్పుడు ఈ యుద్ధం అంతర్జాతీయ ప్రాంతీయ పరిణామాలకు దారితీసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే ఈ యుద్ధం ఇప్పటికైతే మానసికం గా రెండు ప్రధాన మతాల మధ్యవైరంగా కనిపిస్తుంది కానీ రానురాను ఇది మానసికస్థాయి నుండి భౌతికస్థాయివైరంగా మారొచ్చు. ఇప్పటికే ప్రపంచంలోని కొన్నిదేశాలలో పాలస్తీన అనుకూల నిరసనలు ఇజ్రాయిల్ అనుకూల నిరసనలు జరు గుతున్నాయి అంటే ఇది ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉంది. గాజాలో ఇజ్రాయిల్ మారణ హోమం సృష్టిస్తుందని ఆరోపిస్తూ అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసునడుస్తున్నది. అంతర్జాతీయ నేర న్యాయస్థానం ఇజ్రాయిల్, హమాస్ నాయకులకు అరెస్ట్ వారెంట్లను కూడా జారీచేసిందిఅయినా ఎవరు కూడా వాటిని గౌరవించిన పాపానపోలేదు. అమెరికా కొన్ని యూరప్ దేశాలు ఇజ్రాయిల్‌కు విస్తృతంగా ఆర్థిక సైనిక సహాయం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో ఇజ్రా యిల్ కొరకై వీటో అధికారాలను కూడాప్రయోగించింది. చారిత్రకంగా చూసినప్పుడు 1400 సంవత్సరాల క్రితం యూదులు అక్కడ నుండి తరిమివేయబడ్డారు. అక్కడ పాలస్తీనీయులు స్థిరపడ్డారు. 1948లో ఇజ్రాయిల్ స్థాపన ప్రకటన తర్వాత జరిగిన పాలస్తీనలో యుద్ధంలో జోర్డాన్ ఆధీనంలో ఉన్న వెస్ట్‌బ్యాంక్ ఈజిప్ట్ ఆధీనంలో ఉన్న గాజా స్ట్రిప్ ప్రాంతాలు తప్ప మిగతా పాలస్తీనా ప్రాంతమంతా ఇజ్రాయిల్ దేశస్థాపన జరిగింది. అలా ఉండగానే 1967 లో జరిగిన ఆరు రోజుల యుద్ధంలో గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంకులను కూడా ఆక్రమించింది. "హ్యూమన్ రైట్స్ వాచ్' 'అమ్నేస్టి ఇంటర్నేషనల్'లు ఇతర మానవ హక్కుల సంస్థలు ఇజ్రాయిల్ చేష్టలను వర్ణ వివక్షతతో కూడుకున్న ఆక్రమణగా పేర్కొన్నాయి. వెస్ట్ బ్యాంకులో ఎప్పటికీ అంతము లేని ఆక్రమణ గాజా దిగ్బంధనాలపై పాలస్తీనా ప్రజలు నిరాశ నిస్పృహలతో ఉన్నారని "అసోసియేటెడ్ ప్రెస్" పేర్కొన్నది. ఇజ్రాయిల్ హెజ్బుల్లా మధ్యలో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం లాగానే ఇజ్రాయిల్, హమాసులు కూడా శాంతి ఒప్పందం కుదుర్చుకొని పశ్చిమాసియానా ప్రశాంతత చేకూ ర్చితే ప్రజలు యుద్ధ పీడన నుండి విముక్తులవుతారు.

# ఉపాధ్యాయులపై మితిమీరిన ఆంక్షలు సరికాదు

వాసిలి సురేష్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం మెగా పేరెంట్స్ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులెవరూ సెలవులు పెట్టుకోవడానికి వీలు లేదంటూ విద్యా శాఖాధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబరు ఏడవ తేదీన అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించడాన్ని ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ, సమావేశం పూర్తయ్యే వరకు ఉపాధ్యాయులు ఎవరూ పాఠశాలలకు సెలవు పెట్టుకోవడానికి వీల్లేదంటూ మండల విద్యా శాఖాధికారులు సెలవులు మంజూరు చేయకుండా నిరాకరించడం సరికాదు. అనారోగ్య కారణాల వల్ల, అత్యవసర కార్యక్రమాల వల్ల, కుటుంబ సమస్యల వల్ల ఇబ్బంది పడే ఉపాధ్యాయులను సాధారణ సెలవులు వాడుకోవద్దు అంటూ అడ్డుకోవడం తగదు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారు. కానీ ఉపాధ్యాయులకున్న హక్కులను హరించే విధంగా అధికారులు వ్యవహరించడం మంచిది కాదు. ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే సాధారణ సెలవుల వినియోగంలో పదిశాతం మించి ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకోకూడదంటూ విద్యా శాఖాధికారులు ఆంక్షలు విధించడం తగదు. ఇటీవల ఎస్సీ ఈఆర్టీ ఆధ్వర్యంలో వందరోజుల పదవ తరగతి కార్యాచరణ ప్రణాళిక విద్యార్థులను ఉపాధ్యాయులను గురిచేసే విధంగా ఉంది. పదవ తరగతి విద్యార్థు లకు ప్రత్యేక తరగతుల పేరుతో సంక్రాంతి పండుగ సెల వుల్లో కూడా పూర్తిగా తరగతులు నిర్వహించే విధంగా కార్యాచరణ ప్రకటించడం జరిగింది. దీంతోఉపాధ్యాయులు, విద్యార్థులు



ఇబ్బందులకు గురవుతారు. సాధారణంగా సెలవు రోజుల్లో విద్యార్థులు పాఠశాలలకు అంతంత మాత్రంగానే హాజరవుతారని అందరికీ తెలిసిందే. అయితే ఉపాధ్యాయులను పూర్తిస్థాయిలో హాజరు కావాలంటూ ఉత్తర్వులు జారీచేసారు. సెలవు రోజుల్లో ఒకరిద్దరు ఉపా ధ్యాయులతో పదవ తరగతి తరగతులు నిర్వహించాల్సిఉంది పోయి మొత్తం ఉపాధ్యాయులు హాజరయ్యే విధంగా కార్యాచరణ రూపొందించారు. దీనివల్ల ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులెవరూ సంక్రాంతి పండుగ కుటుంబ సభ్యులతో జరుపుకునే వీలు లేకుండా పోతుంది. విద్యార్థుల శ్రేయస్సు కొరకు ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి ఉపాధ్యాయులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అయితే విద్యావిషయక కార్యక్రమాల్లో ఉన్నతాధికారులు ఏకపక్షంగా ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసే విధంగా ఉత్తర్వులు జారీచేయడం మంచిది కాదు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తగిన సూచనలు తీసుకొని కార్యక్రమాలు అమలుపరిస్తే విజయవంతం అవుతాయి. పదవ తరగతి వందరోజుల కార్యాచరణ విషయంలో అధికారులు పునఃపరిశీలించాలి. విద్యార్థులకు ఉపాధ్యాయులకు అనువైన విధంగా కార్యాచరణ రూపొందించాలి. సెలవు రోజుల్లో మినహాయించాలి. పదవ తరగతి యాక్షన్ ప్లాన్‌ను సెలవురోజుల్లో మినహాయించే విధంగా సవరణచేయాలి. ఇంకా సిలబస్ పూర్తి కానందున కార్యాచరణ ప్రణాళికను సమ్మేటివ్ 1 పరీక్షల అనంతరం ప్రారంభించాలి. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం పూటలు ప్రత్యేక అల్పాహారం అందించాలి. ప్రతి సబ్జెక్టుకు సగటు విద్యార్థి ఉత్తీర్ణత పొందే విధంగా యాభైముఖ్య ప్రశ్నలను రూపొందించాలి. పదవ తరగతి బోధించు ఉపాధ్యాయులకు ప్రత్యేక ఓరియంటేషన్ తరగతులు నిర్వహించాలి.

# ప్రజావాక్కు



## రాయితీలను పునరుద్ధరించాలి

చాలా రైళ్లలోఇంకా ఇండియన్ కమోడ్‌లే ఉన్నాయి. వయోవృద్ధులు, మోకాళ్లనొప్పులు, చిన్న వయసు కలవారు చాలా యిబ్బందులు పడుతున్నారు. కొందరు కూర్చుని లేవలేక కాళ్లుకమోడ్‌లలోపడి ఫ్రాక్చర్‌లుఅవుతున్నాయి. ఈ మధ్య ప్రయాణించిన నర్సపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్లో కొందరు వృద్ధులుఈరకమైన అనుభవాల్ని చవిచూశారు. అది కాకుండా రైలుబోగీలు పాతబడిపోయాయి. మంచినీళ్ల సీసాలుపెట్టుకునేచిక్కాలు చిరిగిపోవడమోలేకపోవడమో గమనించడం జరిగింది. రైళ్లు ప్రారంభస్టేషన్ల నుంచిటైముకు బయలుదేరినా గమ్యస్థానాలకు ఆలస్యంగా చేరుకుంటున్నాయి. సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరలో ఇస్తున్న రాయితీలు తిరిగి పునరుద్ధరించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రజాభిప్రాయం పథకాలకే పరిమితం చేయొద్దు!

ఐవీఆర్ఎస్ ద్వారా పథకాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నట్లు వార్త. అయితే ఇందువలన ప్రభుత్వానికి పెద్దగా ఉపయోగం లేకపోగాప్రభుత్వాన్ని తప్పుదారిపట్టించే ప్రమాదం ఉంది. ఇప్పుడుప్రభుత్వం ప్రజలనుంచి తెలుసుకోవలసిన ముఖ్యమైన అంశాలు సెకి సంస్థతో కుదిరిన సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, రేషన్ బియ్యం పక్కదారి పట్టిన వైనం! ఈరెండు ముఖ్యమైనఅంశాలపై ప్రజల్లో ప్రభుత్వంపై పలుఅనుమానాలు తలెత్తుతున్నాయి. పథకాల పరిధిలో లేని మధ్య తరగతి ప్రజలు, పన్నులు కడుతున్నవారు ప్రజాధనందుర్వినియోగంపై తీవ్రఅసంతృప్తితో ఉన్నారు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## తల్లిదండ్రులదే బాధ్యత

పాఠశాలల్లో చదివే విద్యార్థులు పట్టుమని పది నిమిషాలు కూడా క్లాస్‌లు వినలేకపోతున్నారు. విపరీతమైన మొబైల్ ఫోన్‌ల వాడకంవల్ల పిల్లల్లో చదువుపై ఆసక్తి తగ్గుతుంది. తల్లి తండ్రులు డబ్బు సంపాదనలో పడి పిల్లలు ఏం చేస్తున్నారు అనేది గమనించట్లేదు. తల్లితండ్రులు మొబైల్ వాడకం తగ్గిస్తే పిల్లలు కూడా తగ్గిస్తారు. పిల్లల్ని బయట ఆడుకొనేలా ప్రోత్సహించాలి. ఆటల వలన ఆరోగ్యం, క్రమశిక్షణ కూడా అలవడుతుంది. రేపటి తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉంది.

- ప్రశాంత్ గూరుడు, గోదూర్, జగిత్యాల

## గాడిన పడని బంగ్లాదేశ్

బంగ్లాదేశ్‌లో చెలరేగుతున్న అల్లర్లు, మైనారిటీల లక్ష్యంగా జరుగుతున్నదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. అక్కడి తాత్కాలిక ప్రభుత్వపు అసమర్థత లేదా పరోక్ష తోడ్పాటు వల్ల అవి తగ్గే సూచనలు కనబడడం లేదు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు దిగజారితే, ఆ ప్రభావం భారత్ పై కూడా ప్రతికూలంగానే ఉంటుంది. భారత్‌తో స్నేహం కనపర్చే హసీనా ప్రభుత్వం, తన నియంతృత్వపోకడలకు వ్యతిరేకంగా పెల్లు బికిన పౌరసమాజం ఆందో ళనలతో కూలిపోయింది. ప్రజాస్వామిక ప్రభుత్వం నెలకొల్పే పేరిట ఆమెకు వ్యతిరేకంగా వ్యవహరించిన వివిధ వర్గాలు తాత్కాలికంగా యూనస్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఆయన ఆధ్వర్యంలో పరిస్థితి చక్కబడడం అటుంచి, మైనారిటీలైన హిందువులు, బౌద్ధులు, క్రిస్టియన్లపై, వారి ఆస్తులు, ప్రార్థనా స్థలాలపై దాడులు పెరిగాయి. పొరుగుదేశం సైనిక రాజ్యంగానో, మత రాజ్యంగానో మార్పుచెందడం క్షేమం కాదు.

-డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

## వనాలను కాపాడాలి

మనిషి మనుగడ కోసం అడవులను నరుకుతూపోతున్నారు. మరి అడవిలో జంతువులు పక్షులు ఎలాబతకాలి. ఎక్కడ బత కాలి? మనం వాటి ఆవాసాన్ని తొలగిస్తే అవి మన ఆవాసాలకు వస్తాయి. సరిగ్గా అదే విధంగా జరుగుతున్నాయి. నేడు కొన్ని ప్రాంతాల్లో పులులు చిరుత పులులు పాములు ఎలుగుబంట్లు కోతులు ఇళ్లలోకి జొరబడంచూస్తున్నాం. ఇటీవలకాలంలో ఆసి ఫాబాద్‌లో వరసగా ఇద్దరు రైతులపై పులుల దాడుల సంఘ టనలుచూశాం. అలాగే తిరుపతిలో కూడా అప్పుడప్పుడూ ఇటు వంటి సంఘటనలుజరుగుతాయి. వాటిదాడుల్లో కొందరు తీవ్ర గాయలకుగురవుతున్నారు. కొందరుమరణిస్తున్నారు. ప్రభుత్వం వనాలను కాపాడితే అందులో జంతువులు ఉంటాయి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

## పాల విప్లవం

అవును దేశం మరొక పాల విప్లవం వైపు ప్రయాణించాల్సిన అవసరంఉంది. దేశంలో సన్నచిన్నకారు రైతులు పెద్దమొత్తంలో ఉన్నందు వల్ల సన్న చిన్న కారు పత్రాల ఆధారంగా ఉపాధి హామీలో పశువుల కొట్టాలు ఇవ్వాల్సిఉంది. మరోవైపు పశు వుల కొట్టాలతో మాత్రమే సమస్య పరిష్కారం కాదు. పశువుల కొనుగోలుకు సబ్సిడీ ఇవ్వడం కూడా అత్యవసరం. వ్యవసాయం అంటే పంటలు మాత్రమే అనే ఒక మీమాంసలో దేశం ఉన్నది.

-భారత అవినాష్, జనగామ

# గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు



డాక్టర్ మోటె చిరంజీవి

నమారుతున్న కాలానుగుణంగాగ్రంథాలయాలను ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విజ్ఞానంకోసం గ్రంథాలయాలను ఆశ్రయించి ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. పుస్తకం హస్త భూషణం అన్న రోజులు పోయాయి. గ్రంథాలయం ఇప్పుడు కంప్యూటర్లలోకి చేరింది. టాబ్లెట్, సెల్‌ఫోన్‌లోకి అమరిపోయింది. కాని ఎంతమందికి అవి అందుబాటులో ఉన్నాయన్నది అనుమానమే. ప్రతివ్యక్తికి సొంతగా ఇంటర్నెట్, కంప్యూటర్ దానికి కావలసిన హంగులు అన్ని సమకూర్చగలమా అనేది ప్రశ్న. డబ్బు కలిగిన వాళ్ల పిల్లలకే పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఇక మధ్యతరగతి, పేద పిల్లలకు అందుతుందనేది పగటి కలే. ఇంటర్నెట్‌లో పిల్లలు పుస్తకాలు చూడడం లేదు. ఇంటర్‌నెట్‌లో పుస్తకం చదవడం కన్నా లైబ్రరీలకు వెళ్లి పుస్తకాలు చదివే సంస్కృతి నేర్పాలి. అయితే ప్రస్తుతం దేశంలో ముఖ్యంగా యువతరంలో గ్రంథాయలస్ఫూర్తి లోపించినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వం గ్రంథాలయాలను పట్టించుకోవడం లేదు. పాత పుస్తకాలకు రక్షణ లేదు. కొత్త పుస్తకాలు తెప్పించరు. ఒకవేళ తెప్పించినా 100లో 30 నుండి 40 వరకు మాత్రమే కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయి. తెప్పించిన పుస్తకాలలో వ్యాపారుల ఒత్తిడికి లొంగి అత్యంత ఉపయోగం లేని పుస్తకాలకే ఆర్డర్లు, ఈ పుస్తకాలను చూసే ఉద్యోగులు తగినంతమంది లేకపోవడంతో వాటిని చదువుకునే వారికి ఇవ్వడం కూడా తగ్గింది. గ్రంథాలయ సెస్ మాత్రంప్రజల నుండి ఇంటింటికి వసూలు చేయబడుతూనే ఉంది. అసలు ఈ విషయం ఇంటి పన్ను కట్టే ప్రజలకు తెలియడం లేదు. వారికి దగ్గరలో ఉన్న గ్రంథాలయాల్లో సరియైన వసతులు లేవు. ఏవో ఒకటి లేదా 2, 3 పేపర్లతోమాత్రమే సరిపెడుతున్నారు. ఇక కేంద్ర గ్రంథాలయాల్లో కొత్త కొత్త పుస్తకాలతో, కొత్త శాస్త్ర పరిజ్ఞాన శాస్త్రం ఉపయోగించే కంప్యూటరీకరణతో, అన్ని హంగులతో ఏర్పాటు చేసినా అవి సంపూర్ణంగా అభివృద్ధి చెందడం లేదు. అవి ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ముఖ్యంగా సంవత్సరం సిలబస్ మారుతుంటే దానికి సంబంధించిన ప్రభుత్వ పుస్తకాలు ప్రింట్ కాక, అందుబాటులోకి రాక సామాన్య మానవులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలలో గ్రంథాలయాల ప్రాముఖ్యన్ని తెలియజెప్పాలి. మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా? లేదా? అనే ప్రశ్న ఒకటైతే అవి తెలుగు భాషలో దొరుకుతాయా అన్నది మరోప్రశ్న? గ్రంథాలయాల్లో నూతనంగా ఏర్పడే మిత్రుల వల్ల కూడా



మంచి ప్రయోజనం ఉంటుంది. కంప్యూటర్ వ్యవస్థ అభివృద్ధి చెందిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా గ్రంథాలయాలను అభివృద్ధి పరుచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయంకోల్‌కత్తలో ఉంది. దీనిని 1860 లో స్థాపించారు. 2010నాటికి ఈగ్రంథాలయంలో 24 లక్షల పుస్తకాలు ఉండేవి. ప్రస్తుతం అవి 68 లక్షలకు పైగా పెరిగాయి. గ్రంథాలయ వ్యవస్థ ఈనాటిది కాదు గాంధీజీ సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా గ్రంథాలయాల పట్ల అవగాహన కల్పించి, వాటికి ఆదాయ వనరులు సమకూర్చి వాటితో పుస్తకాలను కొని, గ్రంథాలయాలలో వాటిని పొందుపరచడం జరిగింది. ఇలా గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన, సంరక్షణ చేయాలనే దృక్పథం తెచ్చేందుకు ఈ గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అంతర్జాలం వ్యాప్తి చెందిన తరువాత గ్రంథాలయంలోని పుస్తకాలను డిజిటలైజ్ చేసి, ఎక్కడి నుండైనా చదవడానికి వీలుగా వెబ్సైట్ల ద్వారా అందజేస్తున్నారు. విద్యాసంవత్సరంప్రారంభమైన నాటి నుండి విద్యార్థులకుపుస్తకాల కోసం ఒక్కటే టెన్షన్. ఏ షాపుకు వెళ్లినా కొన్ని పుస్తకాలు దొరుకుతాయి. మరికొన్ని ఉండవు. ఎక్కడికెళ్లినా ఇదే సమస్య ఎదురవుతుంది. సమయానికి పుస్తకాలు దొరక్క, తల్లిదండ్రులు సైతం హైరానా పడతారు. అలాంటి వారికి గ్రంథాలయాలలో దొరికే పుస్తకాల ద్వారా కొంత ఉపశమనం కలుగుతుంది. ఇంకా కెజి నుండి పిజి వరకు టెక్స్ట్ పుస్తకాలు, అలాగే ఎప్ సెట్, లాసెట్, డైట్. సెట్, జెఈఈ, ఎఐఈఈఈ, నీట్, గ్రూప్స్, యూపిఎస్సి వంటి ఇంకా అన్ని పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు సైతం గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయి. తెలంగాణ రాష్ట్రంలో 1స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, 33 జిల్లా గ్రంథాలయ సంస్థలు, 537 వరకు మండల స్థాయిలో గ్రంథాలయాలు ఉన్నాయని, 5 లక్షల సభ్యత్వాలను కలిగి, 68 లక్షలు పుస్తకాలను, నెలకు 20 లక్షల మంది వరకు గ్రంథాలయాలను సందర్శిస్తారని ప్రభుత్వం లెక్కలు చెబుతుంది. పబ్లిక్ లైబ్రరీలు 670, సుమారు 1000 వరకు ప్రైవేట్ లైబ్రరీలు, 2000 వరకు విద్యాసంస్థల లైబ్రరీలను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. గ్రంథాలయాలను ఆ విధంగా ఉపయోగించుకుంటే మంచిదే కానీ అంత మంది పుస్తక పాఠకులు సరిగా వినియోగించుకుంటున్నారా అనేది ఆలోచించాల్సిన విషయం. ఇప్పటికీ గ్రామాల్లో విజ్ఞానాన్ని అందించేవి గ్రంథాలయాలే. కాలక్షేపం కోసంగ్రంథాలయాలకు వెళ్లే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. విషయ పరిజ్ఞానం, విజ్ఞాన సముపార్జన కోసం, గ్రంథాలయాలపైన ఆధారపడే వారిసంఖ్య ఎక్కువ. ఇటీవల కాలంలో ఉన్నత చదువుల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు సైతం గ్రంథాలయాలకు వెళుతున్నారు. విద్యార్థులు విజ్ఞానం అందించే ఎన్నో గ్రంథాలను గ్రంథాలయాల్లో ఉంచడం చాలా కాలం క్రితమేమొదలైనప్పటికి పుస్తకాలు బజారులో కొనాలంటే ఎక్కువధరతో ఉంటున్నాయి. గ్రంథాలయాలనుమెరుగుపరుచుకుందాం. భావి తరాల భవిష్యత్తుకుపునాది వేద్దాం. అప్పుడే నేటియువత విజ్ఞానవంతులై మనరాష్ట్రానికి, మన దేశానికి, వారు మంచి పేరు తీసుకొస్తారు.

మనవి


ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బందీలను విడిచిపెట్టండి..లేదంటే నరకం చూపిస్తా

## హమాస్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, డిసెంబరు 3:** ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. తమ చెరలోని బందీలకు సంబంధించిన వీడియోను ఇటీవల హమాస్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఉగ్ర సంస్థపై విరుచుకుపడ్డారు. తాను అధికార బాధ్యతలు చేపట్టకముందే వారిని విడిచిపెట్టాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు చేశారు. 'నేను అమెరికా అధ్యక్షుడిగా 2025 జనవరి 20న బాధ్యతలు స్వీకరిస్తాను. ఈలోపు బందీలను విడుదల చేయాలి. లేకపోతే ఈ దురాగతాలకు పాల్పడే వారికి నరకం చూపిస్తాను. చరిత్రలో చూడని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెంటనే బందీలను విడుదల చేయండి' అని హెచ్చరించారు.

ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచేందుకు హమాస్ మిలిటరీ విభాగమైన అల్ కస్సామ్ బ్రిగేడ్ ఓ వీడియోను విడుదల చేసింది. అందులో అమెరికా-ఇజ్రాయెల్ జాతీయుడైన 20 యేళ్ల ఎడాన్ అలెగ్జాండర్ మాట్లాడారు. అందులో 'నేను గత 420 రోజులుగా హమాస్ చెరలో బందీగా ఉన్నాను. మేమంతా భయంతో రోజుకు వెయ్యిసార్లు చస్తున్నాం. మమ్మల్ని త్వరగా విడిపించండి' అని అలెగ్జాండర్ అభ్యర్థించాడు. ఈ వీడియోపై బాధితుడి తల్లి స్పందించి.. ఎడాన్‌తో సహా బందీలందరి విడుదలకు ప్రధాని నెతన్యాహు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ క్రమంలోనే డొనాల్డ్ ట్రంప్ ఈ మేరకు హెచ్చరించారు.

గత యేడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయడంతో సుమారు 1,200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 251 మందిని ఆ ఉగ్ర సంస్థ బంధించి గాజాలోకి తీసుకెళ్లింది. మధ్యలో తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం వేళ కొందరు బందీలు విడుదలయ్యారు. తర్వాత పలు ఘటనల్లో మరికొందరు మృతి చెందగా.. ప్రస్తుతం 51 మంది మాత్రమే సజీవంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ మీడియా చెబుతోంది.

**లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు:** ఇజ్రాయెల్-హెజ్‌బొల్లాల మధ్య 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ఒప్పందం ఉల్లంఘనకు గురైంది. లెబనాన్ వ్యాప్తంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 11 మంది చెందినట్లు లెబనాన్ అధికారులు తెలిపారు. టెల్‌అవీవ్ తొలుత ఉల్లంఘనకు పాల్పడిందని హెజ్‌బొల్లా ఆరోపిస్తూ దళాలను లక్ష్యంగా చేసుకొని ప్రొజెక్టైల్స్‌ను ప్రయోగించింది. ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణ మంత్రి కాట్జ్ తీవ్రంగా ఖండించారు. హెజ్‌బొల్లా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



భోపాల్ దుర్ఘటన జరిగి 40 సంవత్సరాలు గడిచినా తమకు సరైన పరిహారం అందలేదంటూ మంగళవారం యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద నిరసన ప్రదర్శన జరిపిన బాధితులు

# అదానీ వ్యవహారంపై ఇండియా కూటమి ధ్వజం


## పార్లమెంటు ఆవరణలో కూటమి ఎంపిల నిరసన

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** ఆదాని అవినీతి వ్యవహారంపై జాయింట్ పార్లమెంటు కమిటీని ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేస్తూ ఇండియా కూటమి పార్టీల ఎంపిలు పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆదానిపై అమెరికా కోర్టు అభియోగాలు నమోదుపై భారత్‌లో కూడా విచారణచేయాలని ఇందుకోసం జెపిసిని ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేస్తూ ఎంపిలు నినాదాలుచేసారు. కాంగ్రెస్, ఆప్, ఆర్జేడి, శివసేన యుబిటి, డిఎంకె, వామపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించి పెద్దపెట్టున నినాదాలు చేసారు. ప్రధాని మోదీయే ఇందుకు బాధ్యత వహించాలని డిమాండ్ చేసారు. విపక్ష కూటమి నేత రాహుల్‌గాంధీ, ఆప్ ఎంపి సంజయ్‌సింగ్, ఆర్జేడి మీసాభారతి, శివసేన థాకరే ఎంపి అరవింద్ సావంత్ వంటివారు ఈ నిరసనలో పాల్గొన్నారు. పార్లమెంట్‌లోని మకరద్వారం వద్దనే నిలబడి విపక్ష ఎంపిలు ఈనిరసనలో పెద్ద పెట్టున నినాదాలుచేసారు. ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని కంపెనీ ఇతర అధికారులపై నమోదయిన అవినీతి, మోసం అభియోగాలపై తక్షణమే విచారణచేయాలనివారు పట్టుబట్టారు. బిలియనీర్ ఆదానిపై అమెరికాలో అవినీతి,మోసం లంచాలు ఎరచూపించారన్న అభియోగాలను అమెరికా జస్టిస్ డిపార్టుమెంట్ నమోదుచేసింది. ఆదానిపై అభియోగాలు నమోదయిన సంగతి తెలిసిందే.ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ఎంపి రాహుల్ అయితే ఆదానిని వెంటనే అరెస్టుచేయాలని డిమాండ్‌చేసారు. అంతేకాకుండా ఆదాని గ్రూప్ ఇప్పటివరకూ చేపట్టిన వ్యవహారాలన్నింటిపైనా జెపిసి విచారణ జరగాలని కోరారు.

అయితే విపక్ష పార్టీల ఆరోపణలే కాకుండా కోర్టులో నమోదయిన అభి యోగాలుపైనా ఆదాని స్పందించారు. ఇలాంటి అభియోగాలు మమ్మల్ని మరింత దృ ఢంగా ముందుకు పోయేందుకు సహకరిస్తా యన్నారు. తమపై వచ్చిన ఆరోపణలన్నీ న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు.

# మతసామరస్యాన్ని దెబ్బతీస్తే సోదరభావం మటుమాయం

## సంభాల్ హింసపై లోక్‌సభలో అఖిలేశ్‌యాదవ్ ధ్వజం



**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** సంభాల్ ప్రాంతంలో పక్కా ప్రణాళిక ప్రకారమే హింసకు పాల్పడినట్లు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్‌యాదవ్ ఆరోపించారు. మతసామరస్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. లోక్‌సభలో జీరో అవర్‌లో సంభాల్‌లో జరిగిన హింసపై మాట్లాడారు. మొఘల్ కాలం నాటి మసీదులో కోర్టు ఆదేశాల ప్రకారం సర్వే చేపట్టడాన్ని సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకించింది. మసీదు సర్వే ద్వారా గంగా-జమునా తెహజీబ్‌ను దెబ్బతీస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఎక్కడపడితే అక్కడ తవ్వాలనుకునేవాళ్లు ఒకరోజు ఈ దేశ సోదరభావాన్ని కోల్పోతారని అఖిలేశ్ హెచ్చరించారు. యుపి, కేంద్రంలోని బిజెపి సర్కార్లను ఉద్దేశిస్తూ ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. సంభాల్ హింసలో అయిదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు అఖిలేశ్ ఆరోపణ చేయడంతో సభలో రగడ మొదలైంది. అఖిలేశ్‌కు అండగా పలు విపక్ష ఎంపిలు నిలిచారు. అయితే మళ్లీ సభ మామూలుస్థాయికి వచ్చిన తర్వాత.. అఖిలేశ్‌యాదవ్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విశ్వసించదని అన్నారు. యుపిలో నవంబరు 13వ తేదీన జరగాల్సిన ఉప ఎన్నికలను వాయిదా వేశారని ఆరోపించారు. నవంబరు 19న మసీదులో సర్వే చేయించి, 20న ఎన్నికలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. నవంబరు 24న మరో సర్వే చేపట్టారని, ఆ ప్రదేశానికి చేరుకున్న ప్రజలపై సర్కిల్ ఆఫీసర్ లాఠీచార్జి చేశాడని, ఆ తర్వాత పోలీసులు కాల్పులు జరిపినట్లు అఖిలేశ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో జనం గాయపడ్డారని, దాంట్లో అయిదు గురు మృతి చెందాని, పోలీసులపై హత్యకేసు నమోదు చేయాలని అఖిలేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు.

# తాజ్‌మహల్‌ను పేల్చేస్తామని పర్యాటక శాఖకు బెదరింపు

**ఆగ్రా, డిసెంబరు 3:** ప్రముఖ పర్యాటక సంస్థల అయిన ఆగ్రాలోని తాజ్‌మహల్‌కు బాంబు బెదిరింపు వచ్చిందని ఉత్తరప్రదేశ్‌పర్యాటకశాఖ వెల్లడించింది. తాజ్‌మహల్‌ను పేల్చేస్తామని బెదిరింపుకాల్స్ వచ్చాయని వెల్లడించడంతో పోలీసులు వెంటనే అప్రమత్తం అయి అణువణువూ సోదా చేసారు. చివరకు భూటకపు కాల్ అని పోలీసులు ధృవీకరించారు. ఎసిపి సయ్యద్ ఆరీబ్ అహ్మద్ మాట్లాడుతూ బాంబు డిస్పోజల్



బృందం, జాగిలాల టీమ్ మొత్తం రంగంలోకి దిగి ప్రతి చోటా గాలించాయని, అనుమానిత వస్తువులేవీ కనిపించలేదని అన్నారు. ఉత్తరప్రదేశ్ టూరిజం కార్యాలయానికి తాజ్‌మహల్‌ను పేల్చేస్తామని ఒక ఇమెయిల్ వచ్చిదని, తీరాచూస్తే ఆ మెయిల్‌ప్రకారం అక్కడ ఏదీలేదని ఎసిపి తెలిపారు. ఇందుకు సంబంధించి ఒక కేసును రిజిస్టరుచేసామని తాజ్‌గంజ్‌పోలీసులు ఈకేసులు నమోదుచేయడంతోపాటు గాలింపు చర్యల్లో ప్రత్యేక బృందాలకు సాయం అందించారు. ఇలాంటి భూటకపు ఇమెయిల్‌పంపిన వ్యక్తిని పట్టుకునేందుకు సైబర్‌క్రైమ్‌పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తుచేపట్టారు.

# కృష్ణదాస్ కేసు వాదనకు న్యాయవాదులు విముఖం

**ఢాకా, డిసెంబరు 3:** ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్‌లో అరెస్టు చేసిన విషయం విదితమే. అయితే కోర్టులో ఆయన బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినిపించేం దుకు న్యాయవాదులు ఎవరూ ముందుకు రావట్లేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. కృష్ణదాస్ కేసును వాదించేందుకు ముందుకువచ్చిన ఓ లాయర్‌పై ఆందోళనకారులు తీవ్రంగా దాడి చేయడంతో ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఇస్కాన్ కోల్‌కతా ప్రతినిధి రాధారామన్ దాస్ పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా న్యాయవాది నివాసంపైనా దాడి చేశారన్నారు. రవీంద్ర ఘోష్ అనే మరో న్యాయవాది కేసును వాదించేందుకు దాదాపు 250 కిలోమీటర్లు ప్రయాణించి ఢాకా నుంచి వస్తే స్థానికులు అతడిని కోర్టు ప్రాంగణంలోకి అనుమతించలేదని ఆరోపించారు. దీంతో చిన్మయ్ కృష్ణదాస్ తరఫున కేసును వాదించేందుకు లాయర్లు భయపడుతున్నారని తెలిపారు. దీంతో బెయిల్ విచారణను బంగ్లాదేశ్ కోర్టు వచ్చే నెలకు వాయిదా వేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గత నెలలో అక్కడ జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను ఉద్దేశించి పలు వివా దాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో చెలరేగిన ఘర్షణల్లో ఓ న్యాయవాది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం (ఇస్కాన్) కార్య కలాపాలపై నిషేధం విధించాలని ఓ న్యాయవాది పిటిషన్ వేయగా బంగ్లాదేశ్ హైకోర్టు దానిని కొట్టివేసింది.

# సంభాల్‌మసీదు సందర్శించనున్న రాహుల్ ఎంపిల బృందం

## బృందంలో వయనాడ్ ఎంపి ప్రియాంక ఉంటారని కాంగ్రెస్ వెల్లడి

**న్యూఢిల్లీ,డిసెంబరు 3:** హింసాత్మకంగా మారిన సంభాల్‌లోని సర్వేచేయనున్న మసీదు ప్రాంతాన్ని లోక్‌సభలో విపక్ష నాయకుడు ఎంపి రాహుల్ గాంధీ బుధవారం పర్యటించనున్నట్లు ప్రకటించారు. రాహుల్‌తోపాటు యుపిలోని ఐదుగురు కూటమి ఎంపిలు కూడా సంభాల్‌లోని ఉద్రిక్తంగా మారిన మసీదు ప్రాంతంలో పర్యటిస్తారు. యుపి కాంగ్రెస్ చీఫ్ అజయ్‌రాయ్ మాట్లాడుతూ వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ వాద్రాకూడా సంభాల్‌కు వస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. పార్టీప్రధాన కార్యదర్శి యుపి ఇన్



ఛార్జి అవినాశ్‌పాండే కూడా రాయ్‌తోపాటే ఉంటారని ఆయన చెప్పారు. ముందురోజు యుపి నుంచి వెళ్లిన కాంగ్రెస్ ప్రతినిధులను సంభాల్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. సంభాల్ బయటి వ్యక్తులు, ప్రజాప్రతినిధులను ఈ ప్రాంతంలోకి ఈనెల 10వ తేదీ వరకూ అనుమతించేదిలేదని పోలీసులు ప్రకటించారు. గతనెల 19వ తేదీ నుంచి సంభాల్ మసీదుప్రాంతంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ముఘల్‌కాలంనాటి మసీదును సర్వేచేయాలని కోర్టు ఉత్తర్వులు జారీచేయడంతో రెండు మతాలమధ్య భారీ ఎత్తున హింసచోటుచేసుకుంది. మొఘల్ కాలంనాటికి ముందు ఈప్రాంతంలో హరిహర్ దేవాలయం ఉందని కూలగొట్టి మసీదు నిర్మించారని ఆరోపణలు న్నాయి. గతనెల 24వ తేదీ నిర్వహించిన రెండో సర్వే సందర్భంగా భారీ ఎత్తున హింస చెలరేగింది. షాహి జమా మసీదు ప్రాంతంలో పోలీసులకు మసీదు మద్దతుదారులకు మధ్య భారీ ఎత్తున ఘర్షణలు చెలరేగాయి. ఈసందర్భంగా జరిగిన ఘర్షణలో ఐదుగురుచనిపోగా అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి.

# థానె జూపిటర్ ఆసుపత్రిలో షిండేకు వైద్యపరీక్షలు



**ముంబయి, డిసెంబరు 3:** మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే అస్వస్థతకు గురికావడంతో ఆయన్ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. థానెలోని జూపిటర్ ఆసుపత్రిలో ఆయన చేరి వైద్యపరీక్షలుచేయించుకున్నారు. ఆయన ఆరోగ్యపరిస్థితి ఇప్పటికీ కొంత తీవ్రంగానే ఉందని క్రమేపీ మెరుగుపడాలని వైద్యులు సూచించారు. వైద్యపరీక్షల అనంతరం తగు సూచనలు చేసి ఆయన్ను ఆసుపత్రినుంచి డిశ్చార్జి చేసారు. శివసేన చీఫ్ వార్వాలోని అధికారిక నివాసానికి చేరుకున్నట్లు షిండేసేన నేతలు తెలిపారు. ఆతర్వాత షిండేను స్పందించాలని కోరిన మీడియాకు అంతా సవ్యంగానే ఉందని బదులిచ్చారు. అయితే సేవన నాయకుడు ఉదయ్‌సామంత్‌మాట్లాడుతూ ఇది సహజంగానే ఆయన చేయించుకునే వైద్యపరీక్షల్లో భాగమని ఆయన గొంతునొప్పి, నీరసం, జ్వరంతో బాధపడుతున్నారని అందువల్ల రక్తపరీక్షలుచేసారని సామంత్ తెలిపారు. ఆసుపత్రినుంచి బయటకు రాగానే తాను ఆరోగ్యంగానే ఉన్నానంటూ సీఎం షిండే ప్రకటించారు. కేవలం వైద్యపరీక్షలకోసమే ఆసుపత్రిలోచేరానన్నారు. మహారాష్ట్ర సీఎం ఎంపికపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన బిజెపికే ఈసారి సీఎం పదవి దక్కుతుందని సీఎంగా ఫడ్నవిస్ పేరును బిజెపి ఖాయంచేసిందని వార్తలు వినిపిస్తున్నా చివరకు ఫడ్నవిస్ సీఎం, షిండే, అజిత్‌లు డిప్యూటీ సీఎంలుగా పదవీ ప్రమాణాలుచేస్తారని మహాయుతి సిఎల్పీ సమావేశంలో ఏకాభిప్రాయంకుదిరిందన్న వార్తలు ఇపుడు హల్‌చల్ చేస్తున్నాయి.



# ఎఐ కాదు ఎక్యూఐపై చర్చించాలి

## పార్లమెంట్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం మాట్లాడాల్సింది ఎఐ గురించి కాదని ఎక్యూఐ గురించి అని ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా అన్నారు. పార్లమెంట్‌శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో కొనసాగుతున్న చర్చల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా ఢిల్లీ వాయు కాలుష్యం అంశాన్ని లేవనెత్తారు. రైతులు పంట వ్యర్థాలను దహనం చేయడం వల్లే ఢిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతుందనే వాదనలు సరైనవి కాదని ఆయన పేర్కొన్నారు. సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎఐ గురించి చర్చిస్తూ డిజిటల్ మోసాల బెదిరింపులను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడడంపై చద్దా స్పందిస్తూ కేంద్రం చర్చించాల్సింది ఎఐ గురించి కాదు ఏక్యూఐ గురించి అని పేర్కొన్నారు. ఢిల్లీ కాలుష్యం నుంచి బయటపడాలంటే ఏక్యూఐ గురించి తప్పక చర్చించాలని అన్నారు. హర్యానా రైతులు పంట వ్యర్థాలు దహనం చేయకుండా ఉండేందుకు పాడీ ఛాపర్, హ్యాపీ సీడర్ వంటి పరికరాల కొనుగోలు కోసం వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికసహాయం చేయాలని సూచించారు. రైతులకు ఎకరాకు కేంద్రం నుంచి రూ. 2,000, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.500 చెల్లించాలని సూచించారు. ఢిల్లీలో వాయు కాలుష్యం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. దేశ రాజధానిలో వాయు కాలుష్య నియంత్రణకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ 4 నిబంధనలు విధించారు.

# మంత్రి, అధికారులపై బురద చల్లిన వరదబాధితులు

**విల్లుపురం(తమిళనాడు), డిసెంబరు 3:** వరదబాధితులకు సాయం అందించడంలో రాష్ట్రప్రభుత్వం తీవ్రమైన జాప్యంచేస్తోందని నిరసన తెలుపుతూ బాధితుల్లో కొందరు పర్యటనకువెళ్లి అటవీ మంత్రి కె పోన్ముడిపై బురదచల్లారు. మంత్రితోపాటు ఆయన కుమారుడు గౌతమ్ సింగమణి, జిల్లా కలెక్టర్ సి పళని ఇతర అధికారులపైనా బాధితుల్లో కొందరు బురదచల్లడంపై అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఇరువెల్‌పట్టు, అరసూర్ గ్రామాల్లో వరద సహాయక చర్యలను పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి అధికారుల బృందానికి వరద బాధితులనుంచి తీవ్ర నిరసన ఎదురయింది. థెన్‌పెన్నై నది వరదలతో పరీవాహక గ్రామాలు వరదనీటితో ముంచెత్తిన సంగతి తెలిసిందే. ఫెంగాల్ తుఫానుసృష్టించిన భీభత్సం తమిళనాడు కోస్తా జిల్లాలను అతలాకుతలంచేసింది. ఈసందర్భం గానే తమకు వరదసాయం అందించడంలో ప్రభుత్వం విపరీత



జాప్యంచేసిందంటూ ఆ ప్రాంత వాసులు తీవ్ర నిరసన వ్యక్తంచేసారు. ఈలోపే గుంపులోంచి కొందరు మంత్రి, కుమారుడు, ఎమ్మెల్యే అధికారులపై వరదమట్టిని చల్లడంతోపరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భారీ వరదలు సంభవించినా రెండురోజులుగా అధికారులు తమవద్దకు రానేలేదని మంత్రికి బాధితులు వివరించారు. మంత్రి ముందు ప్రజల బాధలను తన కారులో కూర్చుని విన్నారు. స్పాట్‌లోఉన్న బిజెపి కార్యకర్తలనుంచే ఈ వరద మట్టి మంత్రి ఇతరులపై పడిందని అన్నారు. అయెనంపాళయం, గింగీ, విల్లుపురం రోడ్డు ప్రాంతాల్లో దళితులు కొందరు మంత్రి కాన్వా య్‌కు అడ్డంగా నిలిచి నిరసన ధర్నా చేసారు. మూడు గంటలపాటు నిరసన తెలిపి తమకు వెంటనే సాయం అందించాలని, ఆహారం, ఆశ్రయం కల్పించాలని డిమాండ్‌చేసారు. సహాయ కేంద్రాలుగా ఏర్పాటుచేసిన రోజామ్యారేజ్ హాలు, ఎంఎస్ హాల్స్‌నుంచి బయటికి గెంటివేసారని బాధితులు ఆరోపించారు. మా ఇళ్లన్నీ వరదనీటి లో మునిగిపో యాయని అయినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆరోపించారు. విక్రవండి ఎమ్మెల్యే అన్ని యూర్ శివ వెంటనే స్పాట్‌కు వెళ్లి నిరసనాందోళనకారులను బుజ్జగించి శాంతింప చేసారు. వెంటనే వరదసాయం అందించేటట్లు ఏర్పాట్లు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆందోళ నకారులు శాంతించారు.

# బంగ్లా అరాచకాలకు యూనస్ ప్రభుత్వమే కారణం

## మాజీ ప్రధాని షేక్ హసీనా

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** బంగ్లాదేశ్‌లోనెలకొన్న అనిశ్చితికి ప్రధాని మహమ్మద్‌యూనస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వానిదేనని మాజీ ప్రధాని షేక్ హసీనా ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలనే లక్ష్యంగాచేసుకుని బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. న్యూయార్క్‌లో జరిగిన అవామీ లీగ్ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న షేక్ హసీనా ప్రసంగిస్తూ బంగ్లాలో హిందూ దేవాలయాలు, చర్చిలు, ఇస్కాన్‌పై వరుసదాడుల నేపథ్యంలో యూనస్‌ప్రభుత్వంపై మండిపడ్డారు. తనపై సామూహిక హత్యల ఆరోపణలు వచ్చాయని, కేసులు కూడా నమోదు చేసారని కానీ వాస్తవానికి విద్యార్థి సంఘాలతోకలిసి పక్కాప్రణాళికతో సామూహిక హత్యలకు పాల్పడింది మహ్మద్‌యూనస్ వారే. సూత్రధారులని దేశంలో ఇలాగే



మరణాలుకొనసాగితే ప్రభుత్వ మనుగడ సాగదని లండన్‌లో ఉన్నమాజీ ప్రధాని ఖలీదాజియా కుమారుడు తారిక్ రెహమాన్ కూడా అన్నారు. దేశంలోమైనార్టీలు ఉపాధ్యాయులు, పోలీసులు అందరిపైనా దాడిచేసి చంపేస్తున్నారని, హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు లక్ష్యంగా చేసుకుంటున్నారని, చర్చిలు అనేక దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని వీటన్నింటికీ మాస్టర్‌మైండ్ యూనస్ అని ఆమె ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలను ఎందుకు టార్గెట్ చేస్తున్నారని హసీనా ప్రశ్నించారు.

తాను దేశాన్ని ఎందుకు వీడాల్సి వచ్చిందో ఆమె మరోసారి వివరించారు. తన తండ్రిలాగే తనను కూడా హత్య చేసేందుకు కుట్రలు జరిగాయని, వాటిని ఎదుర్కోవడం నాకు ఆరగంట సమయం పట్టదని నాభద్రతా సిబ్బంది కాల్పులు జరిపి ఉంటే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయే వారని కానీ ఊచకోతను నేను కోరుకోలేదని అన్నారు. అధికారం కోసం ఇక్కడే ఉంటే మారణహోమం జరిగేదన్నారు. ప్రజలను విచక్షణారహితంగా చంపేస్తుండటంతోనే దేశం విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నానని అందుకే ఆందోళనకారులపై కాల్పులు జరపద్దని నాభద్రతా సిబ్బందికికూడా చెప్పానన్నారు.



# భార్య తరపు బంధువులతో అమెరికా కొత్త ఉపాధ్యక్షుడు జెడివాన్స్

**వాషింగ్టన్, డిసెంబరు 3:** అమెరికా కొత్త ఉపాధ్యక్షుడు జెడివాన్స్ సతీమణి ఉష చిలుకూరి దంపతుల ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనా సాదాసీదాగా నీలిరంగు టీషర్ట్ ధరించినజెడివాన్స్ తనకుమారుడుని ఎత్తుకుని ఫోటోకు ఫోజులిచ్చారు. తనభార్య ఉషచిలుకూరి తరపు బంధువులతో సరదాగా గడిపారు. ఆ ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. గతవారం అమెరికాలో థ్యాంక్స్ గివింగ్‌డే సందర్భంగా ఈ ఫోటో దిగారు. ఈ ఫోటోని సిలికాన్‌వ్యాలీ వెంచర్ క్యాపిటలిస్టు ఆషా జెడేజా మోత్వాని ఎక్స్‌లో ట్వీట్‌చేసారు.

అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ తెలుగువారి అల్లుడే. ఆయన భార్య చిలుకూరి ఉషాబాల తెలుగు సంతతికి చెందినవారే కావడం విశేషం. 38 ఏళ్ల ఉషా అమెరికాలోజన్మించినప్పటికీ ఆమె తాతముత్తాతలది ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామం అని గ్రామపెద్దలుచెపుతున్నారు. చిలుకూరి ఉషాబాల ముత్తాత రామశాస్త్రి కొంతబూమిని గ్రామంలో ఆలయంకోసం దానంగా ఇచ్చారు. ఆ స్థలంలోనే గ్రామస్తుల సహకారంతో సాయిబాబా ఆలయం మండపం నిర్మించారు.

# అఖల్‌తక్త్ శిక్షాసేవలు ప్రారంభించిన అకాలీదళ్‌నేత

**అమృత్‌సర్, డిసెంబరు 3:** సిక్కుమతస్తుల అత్యున్నత కమిటీ అఖల్‌తక్త్ వేసిన శిక్షాసేలను మాజీ డిప్యూటి



సిఎం సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ స్వర్ణదేవాలయంలో ప్రారంభించారు. సిక్కుమతాన్ని అపవిత్రంచేసే విధంగా అనుచిత లబ్ధినిచేకూర్చా రన్న అభియోగాలపై ఆయనకు అన్ని సిక్కు మందిరాల్లోను, బాత్‌రూమ్‌లు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా మంగళ వారం అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో మంగళ వారం ఉదయం తన మెడచుట్టూ ఒక పలకం వేసుకుని బల్లెంచేతపట్టి శిక్షాసేవల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఆయన కేబినెట్‌లోచేసిన కొందరు సహచరులు కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అకాలిదళ్ చీఫ్ ఒక వీల్‌చైర్‌లో కూర్చుని అమృత్‌సర్ స్వర్ణదేవాలయం ప్రధాన ద్వారం వద్ద కనిపించారు. సీనియర్ అకాలిదళ్ నాయకుడు బాదల్‌కు బావమరిది అయిన బిక్రమ్‌సింగ్ మజీతియా రణ్‌బీర్‌తరపున శిక్షాసే వలుప్రారంభించారు. స్వర్ణదేవాలయంలో వంటపాత్రలను శుభ్రంచేసారు. అఖల్‌తక్త్ బాదల్‌కు సేవాదార్ చేపట్టాలని, కిచెన్‌శుభ్రం చేయాలని ఆదేశించింది. అలాగే అనేకగురుద్వారాల్లో బాత్‌రూమ్‌లు కూడా కడగాలని ఆదేశించారు. డేరాసచ్చా సౌదా చీఫ్ గుర్మీత్‌రామ్‌రహీమ్‌కు అనుచిత లబ్ధిచేకూర్చినందుకుగాను ఈ శిక్షనువేసారు. మతపరంగా ఆయన వ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డినట్లు అకల్‌తక్త్ చీఫ్ పేర్కొన్నారు.

# సుప్రీం న్యాయమూర్తిగా మన్‌మోహన్ నియామకం

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మన్‌మోహన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ కొల్లిజియం చేసిన సిఫారసులకు కేంద్రం ఆమోదించింది. న్యాయమంత్రిత్వశాఖ అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తన ఎక్స్ ఖాతాలో పోస్టుచేసారు. మన్‌మోహన్ నియామకంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 33కి పెరిగింది. వాస్తవానికి 34 మంది న్యాయమూర్తులు ఉండాలి. గతనెల 28వ తేదీ మన్‌మోహన్‌ను టాప్‌కోర్టుకు సిఫారసు చేసింది. ఇప్పటికీ సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల పదవుల్లో రెండు ఖాళీలున్నాయి. జస్టిస్ హిమాకోహ్లీ, మాజీ సిజెఐ చంద్రచూడ్ పదవీవిరమణలతో ఈ ఖాళీలను భర్తీచేస్తున్నారు. మన్మోహన్ ఆలిండియా హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీలో రెండోస్థానంలో ఉన్నారు. ఢిల్లీ హైకోర్టులో అందరికంటే సీనియర్‌గా ఉన్నారు.

## రేపటి నుంచి జిల్లాల్లో డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ

### 5న నిజామాబాద్, 6న ఆదిలాబాద్, 7న కరీంనగర్ జిల్లాల్లో పర్యటన

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ తన జిల్లాల పర్యటనను తిరిగి ప్రారంభించనుంది. ఈ నెల 5 నుంచి 7 వరకు జిల్లాల్లో బహిరంగ విచారణను చేపట్టనున్నట్టు కమిషన్ సెక్రటరీ బి సైదులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి అవకాశం కల్పించారు. 6న ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఆదిలాబాద్, నిర్మల్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రజల నుంచి.. అలాగే ఈ నెల 7న కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల ప్రజల నుంచి బహిరంగ విచారణ నిర్వహించి వినతులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో బహిరంగ విచారణ నిర్వహించిన డెడికేటెడ్ కమిషన్ ఈ నెల 5 నుంచి 7 వరకు విచారణను నిర్వహించనుంది. నవంబర్ 4న ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ ఈ నెల 9న హైకోర్టుకి నివేదికను సమర్పించాల్సి ఉంది.

### నేటి నుండి ఎస్సీ వర్గీకరణ కమిషన్

## జిల్లాల పర్యటన

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణను అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ బుధవారం నుంచి జిల్లాల పర్యటన చేపట్టనుంది. తమ పర్యటనను సంగారెడ్డి జిల్లా నుంచి ప్రారంభించనున్నట్టు కమిషన్ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డా. షమీం అక్తర్ తెలిపారు. పర్యటనలో భాగంగా తమ దృష్టికి వచ్చిన అర్జీలతో పాటు ప్రతి అంశాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి వర్గీకరణపై ప్రభుత్వానికి ఒక నివేదికను అందజేస్తామని ఆయన చెప్పారు. కమిషన్ కార్యాలయం బీఆర్‌కే భవన్‌లో మాల, మాదిగలతో పాటు, జంగమ, చిందు, బేడ/బుడగ జంగమ, బైండ్ల, మాంగ్, అరుంధతీయ, మిత అయ్యల్వార్ సహా పలు కులాల వారు కమిషన్ చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై వారి అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేశారు. తమ కులాల వెనుకు బాటుతనంతోపాటు, విద్య, ఉద్యోగాల సాధనలో రిజర్వేషన్లను అందు కోవడంలో జరుగుతున్న అన్యాయం గురించి రాతపూర్వకంగా విజ్ఞప్తులను కమిషన్‌కు అందజేశారు. చిందు కులానికి చెందిన ప్రతినిధులు, తమ కులవృత్తి అయిన బాగోతం కళను కమిషన్ ఎదుట ప్రదర్శించారు.



శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరామ్ తదితరులు

## శ్రీకాంతాచారి ఆశయాలను ప్రభుత్వం అమలు చేస్తుంది

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను త్యాగం చేసిన తొలిఅమరుడు శ్రీకాంతాచారి ఆశయా లను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. దశాబ్ద కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేయని ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేసిన ఘనత తమ ప్రజా ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ యువజన విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'తెలంగాణ యూత్ డే' సదస్సులో ఆయన ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమానికి ప్రాణాలను అర్పించిన శ్రీకాంతాచారి చిరస్మరణీయుడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం తనతోనే వచ్చిందని కెసిఆర్ అభాసుపాలైనారని, అభిప్రాయాలు పంటాపంచలు కావాలన్నారు. తెలంగాణ కోసం పోరాడుతుంటే సోనియాగాంధీ మద్దతు ఇచ్చి తెలంగాణను ఇచ్చిందన్నారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించకుండా అవమానపరిచిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హాయంలో ప్రగతి భవన్‌లోకి మంత్రులకు కూడా అనుమతి లేకుండా పోయిందని, గద్దర్ లాంటి మహనీయుడు సైతం ప్రగతిభవన్ ఎదుట అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూసారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడూ తెలంగాణ యువత, విద్యార్థులతోనే రాష్ట్ర సాధ్యమైందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ పితామహుడుగా కోదండరామ్ పేరొందారని, జూపల్లి కృష్ణారావు తెలం గాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవి, ఎమ్మెల్యే పదవి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఈ సదస్సులో సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీంపాషా, మాసంపల్లి అరుణ్‌కుమార్, కొత్త రవి తదితరులు పాల్గొనా న్నరు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి

### ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు టిపిటిఎఫ్ మద్దతు

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ నెల 9 నుండి చేపట్టబోతున్న నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్ ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతిలు తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, వెట్టి చాకిరి విధానం అమలవు తుందని విమర్శించారు. ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా సమ్మెను నివారించడానికి ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు .. సమగ్రశిక్ష ఉద్యోగుల సర్వీసును వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, మిని మమ్ టైమ్ స్కేలు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# దివ్యాంగులారా! లక్ష్యంతో రండి.. సహకరిస్తాం

### మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి సీతక్క

### ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్తేజంగా అంతర్జాతీయ దివ్యాంగుల వేడుకలు

**హైదరబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 3, ప్రభాతవార్త :** దివ్యాంగులు తమలోని లోపాల్ని చూసుకుని బాధ పడొద్దు.. మానసికంగా కుంగి పోవద్దు.... ఆత్మన్యూనతకు లోనుకావద్దు.... మీరు ప్రదర్శించిన ప్రతిభ చూస్తే సకలాంగులకు ఏవిధంగా తక్కువేమీకాదని, ఆత్మ విశ్వాసం, ఆత్మస్థయిర్యంతో ఆకాశమే హద్దుగా ఎదిగేశక్తి, విజయం మీ సొంతమని, నిర్దిష్ట లక్ష్యంతో రండి... నెరవేర్చడానికి మా ప్రజాప్రభుత్వం ముందుం టుందని తెలంగాణ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ, వయోదికులు, ట్రాన్స్‌జెండర్ల, దివ్యాంగులశాఖల మంత్రి దనసరి అనుసూయ సీతక్క భరోసానిచ్చారు. దివ్యాంగుల్లో ఎంతోమంది అత్యున్నతస్థాయిల్లో ఉన్నారని, ఐఎఎస్‌లు అయ్యారని, ఇటీవల దివ్యాంగుల సంక్షేమ హాస్టళ్లలో చదువుకొని 87మంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక వడం గొప్పవిషయమన్నారు. రాష్ట్రంలో 10లక్షలమంది దివ్యాంగులున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి దివ్యాంగుల సంక్షేమం కోసం 50 కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్లినిక్లను ఏర్పాటు చేస్తున్నామని, పోలీసుశాఖలో ఉపాధి కల్పిస్తున్నామని, ట్రాఫిక్ విభాగంలో ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగ నియామకపత్రాలను అందజేస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా దివ్యాంగులకు పది సంవత్సరాలుగా ఇస్తున్న పెన్షన్ నెలకు 300 నుండి వెయ్యికి పెంపుకోసం కోరామన్నారు. అయితే దివ్యాంగులు తమ హక్కుల కోసం ప్రశ్నించండి.. కానీ వీరయ్యకు చీరలు, గాజులు పంపడమేంటి? చీరలు, గాజులు వేసుకున్న మహిళలంటే అంత చులకన భావమా? మహిళల వేషదారణతో కించ పరచడం తగదు హితవు పలికారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ, దివ్యాంగులు, వయోధికులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క, విశిష్ట అతిథులు దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, మహిళా శిశుసంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామ చంద్రన్, దివ్యాం గుల సాధికారత శాఖ సంయుక్త సంచాలకురాలు శైలజ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి ప్రసంగించారు. సభకు శైలజ స్వాగతం పలుకగా వీరయ్య, అనితా రామచంద్రన్‌లు మాట్లాడారు. చివరిగా మంత్రి సీతక్క వీరయ్య, అనిత, శైలజలతో కలిసి పలువురు దివ్యాంగులకు కృత్రిమ పరికరాలను, త్రిచక్రవాహనాలు,




సభలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క, వీరయ్య, అనిత, శైలజ తదితరులు

కంప్యూటర్లు, సైకిళ్లులను అందజేయడంతో పాటు కృత్రిమ పరికరాలను, అవయవాలను స్వయంగా అమర్చడమేకాక సామాజికసేవలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పలువురు సామాజిక కార్యకర్తలకు, దివ్యాంగుల సంఘాల నేతలను సన్మానించి అవార్డులు ప్రదానంచేసి అభినందించారు.

## మావోయిస్టుల ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

### కాంగ్రెస్ పాలన బిఆర్ఎస్ కంటే మెరుగు

### బిజెపికి మాట్లాడే హక్కులేదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన గత బిఆర్ఎస్ పాలన కంటే మెరుగ్గా ఉందని.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో కొన్నింటిని అమలు చేస్తున్నప్పటికీ మిగిలిన రైతు భరోసా, కళ్యాణలక్ష్మి, మహిళాజ్యోతి, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల పెంపు పథకాల అమలు కోసం అంచనాలు వేసి అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనతో పోల్చితే కాంగ్రెస్ పరిపాలనకు 90 శాతం మార్కులు ఇస్తామని.. కానీ ప్రజల ఆలోచన ప్రకారం కాంగ్రెస్ పరిపాలనకు 60 శాతం మార్కులేనన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహాతో కలిసి కూనంనేని మాట్లాడారు. ప్రజలకు సంబంధించిన అభివృద్ధి ఇంకా ప్రారంభం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలని బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అంటున్నాయని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలని కమ్యూనిస్టులు కోరుకుంటున్నారని కూనంనేని తెలిపారు. మాజీ సిఎం వైఎస్ మాదిరిగా ప్రస్తుత సిఎం రేవంత్ మంత్రులు గంట పాటు ప్రజలను కలవాలని, అప్పుడే ప్రజల బాధలు వారికి అర్థమవుతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను విమర్శిస్తున్న బిజెపి పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ప్రభుత్వ ఆస్తులను అమ్ముకోవడం తప్ప, ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. రాష్ట్రానికి జిఎస్టి నిధులు ఇవ్వకుండా, రైతులను, అసంఘటితరంగ కార్మికులను పట్టించుకోకుండా, లేబర్ కోడ్ తెచ్చిన బిజెపికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ పేరుతో జరుగుతున్న హత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, సిపిఐ మధ్య కుదిరిన అవగాహన ప్రకారం సిపిఐకి కార్పోరేషన్ల చైర్మన్ పదవులు ఇవ్వాలని.. గతంలో ఒకటి రెండు ఎమ్మెల్సీ ఉండగా సిపిఐకి అవకాశం రాలేదన్నారు.

## వరంగల్‌లో బ్యాంకు ఉద్యోగి దారుణహత్య

### ఆగిఉన్న కారులో మృతదేహం

### కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**ప్రభాతవార్త, పోచమ్మ మైదాన్ కార్పొరేషన్ :** ఒకవైపు చోరీలు మరోవైపు నిన్న జరిగిన బ్యాంకు ఉద్యోగి దారుణ హత్య సంఘటనతో వరంగల్ నగర ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున వరంగల్ నగరంలోని రంగంపేట లో బ్యాంకు ఉద్యోగిని కిరాతకంగా హత్య చేసి కారులో తాళ్లతో కట్టేసి ఉన్న మృతదేహాన్ని చూసి నగరం ఒక్కసారిగా ఉలిక్కి పడింది.వివరాల్లోకెళ్తే.. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మృతుడు హనుమకొండ శ్రీనగర్ కాలనీకి చెందిన వెలుగేటి రా జమోహన్ తండ్రి పేరు వెంకటాద్రి వయసు 62 సంవత్సరాలు కులం పద్మశాలి అని ఇతను కాకతీయ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గా రిటైర్డ్ అయ్యారని పోలీసులు గుర్తించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మృతుడిని హత్య చేసి తిశి36శి1546 కారు వెనుక భాగంలో తాళ్లతో కట్టి పడేసి ఆ కారును కేఎంసీ ఎదురుగా ఉన్న రంగంపేట ప్రాంతంలోని గల్లీలో కారును వదిలి పరారయ్యారని విషయం తెలుసుకున్న మట్టెవాడ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. ఈ క్రమంలో మృతిని సోదరుడు వెలిగేటి రాజగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టామని మట్టెవాడ ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

## రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌లో ఘనంగా వార్షికోత్సవం

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** భారత దేశంలోని ప్రముఖ పీడియాట్రిక్ మల్టీస్పెషాలిటీ, పెరినాటల్ హాస్పిటల్ చైన్ అయిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ తన 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని ఒక కన్వెన్షన్ హాల్‌లో సిల్వర్ జూబ్లీ మహోత్సవం జరిగింది. ఇందులో రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సిఎండి డాక్టర్ రమేష్ కంచర్ల, క్లినికల్ డైరెక్టర్ ప్రసూతి గైనకాలజీ డాక్టర్ ప్రణతి రెడ్డి పాల్గొన్నారు. దీన్ని పురష్కరించుకుని డాక్టర్ రమేష్ 15 సంవత్సరాలకు పైగా సేవలందించిన 37 మంది ఉద్యోగులను సత్కరించారు. హాస్పిటల్ చైన్‌లోని అగ్రశ్రేణి వైద్యులు అద్భుతమైన ర్యాంప్ వాక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 25 సంవత్సరాల అద్భుతమైన ప్రయాణానికి నివాళిగా, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సంరక్షణ, కరుణ, అంకితభావం మరియు నైపుణ్యాన్ని హైలైట్ చేస్తూ రెయిన్‌బో గీతం విడుదల చేయబడింది. 100 మంది రెయిన్‌బో ఉద్యోగుల చిరునవ్వులతో కూడిన ప్రత్యేకమైన చలనచిత్రం చిరునవ్వులను పెంపొందించే సంస్థ యొక్క లక్ష్యాన్ని ప్రసారం చేయబడింది. ఈ సంద ర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ తాము క్లినికల్ ఎక్సలెన్స్, పిల్లల కేంద్రీకృత వాతావరణం, బలమైన సహాయక సిబ్బంది ద్వారా మిలియన్ల కుటుంబాలలో పరివర్తనను తీసుకు రాగలిగామని చెప్పారు. సుదీర్ఘ చరిత్రతో, రెయిన్ బో తన అధునాతన మౌలిక సదుపాయాలు, నిపుణుల సంరక్షణ ద్వారా పిల్లల కాలేయ మార్పిడి,



మూత్రపిండ మార్పిడి మరియు తీలీగి వంటి క్వాటర్నరీ కేర్ సేవలతో సహా అసాధారణమైన ఆరోగ్య సంరక్షణ సేవలను స్థిరంగా అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందిసహా 4000 మందికిపైగా హాజరయ్యారు.

## ఎఐ అకాడమీ ఇండియా బూట్‌క్యాంప్‌కు గూగుల్ ఫర్ స్టార్టప్స్‌తో 'మ్యాథ్' సహకారం

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** మ్యాథ్ (మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ హబ్) హైదరాబాద్‌లో ఏఐ అకాడమీ ఇండియా బూట్‌క్యాంప్‌ను హోస్ట్ చేయడానికి గూగుల్ ఫర్ స్టార్టప్స్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించింది. డిసెంబర్ 4వ తేది నుంచి 6వ తేది వరకు మూడు రోజుల బూట్‌క్యాంప్ టిహబ్‌లో ప్రారంభం కానుంది. ఈ మూడురోజుల బూట్ క్యాంప్ ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, వాతావరణం, విద్య, ఆర్థిక చేరిక, సైబర్ భద్రత మరియు ప్రజా మౌలిక సదుపాయాలలో క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించడానికి ఏఐని ప్రభావితం చేసే ప్రారంభదశ స్టార్టప్‌లను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చొరవ స్టార్టప్‌లకు మానవకేంద్రీకృత ఏఐ పరిష్కారాలను స్కేల్ చేయడానికి, రూపొందించడానికి అవసరమైన సాధనాలు, జ్ఞానం మరియు మార్గదర్శకత్వాన్ని అందించనుంది. బూట్‌క్యాంప్ అనేది గూగుల్ ఫర్ స్టార్టప్స్ ఏఐ అకాడమీ ఇండియా ప్రోగ్రామ్‌లో భాగం. ఇది దేశవ్యాప్తంగా 10,000 స్టార్టప్‌లను క్లౌడ్ మరియు మార్కెటింగ్ క్రెడిట్‌లు, నిపుణుల మెంటర్‌షిప్ మరియు నెట్‌వర్కింగ్ అవకాశాల వంటి అవసరమైన వనరులతో సన్నద్ధం చేయడానికి ప్రయత్నిస్తుంది. సాంకేతికత, ఆవిష్కరణల కోసం అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా ఉన్న హైదరాబాద్, ఈ ప్రభావ వంతమైన కార్యక్రమానికి వేదికగా నిలిచింది. బూట్‌క్యాంప్ నిపుణుల నేతృత్వంలోని సెషన్‌లు, వర్క్‌షాప్‌లు, నెట్‌వర్కింగ్ అవకాశాలను కలిగి ఉంటుంది. ఏఐ, సాంకేతికతలో పరిశ్రమల నుంచి కొత్త స్టార్టప్‌ల కోసం డైనమిక్ ప్లాట్ ఫారమ్‌ను సృష్టిస్తుంది.

## అన్ని రంగాల్లో దివ్యాంగులు ముందంజ

### బిజెపి కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందున్నారని బిజెపి నేతలు అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడి నాయకత్వంలో 2014సంవత్సరం నుండి దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని గొప్పగా చేస్తుకుంటున్నామన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందున్నారని, సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడుతున్నాన్నారు. ఇటీవల పారా ఒలంపిక్స్‌లో పాల్గొని సత్తాచాటారు. విద్యారంగం, వ్యాపార రంగాల్లో కూడా రాణిస్తున్నారు. కేంద్రప్రభుత్వం దివ్యాంగులకు అనేక పథకాలను ప్రకటించిందని, ఆ పథకాల ద్వారా భారతదేశంలోని దివ్యాంగులకు లాభం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు అవకాశాలు కల్పిస్తే మనం దరితో కలిసి ముందుకువస్తారన్నారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ భగవంతుడు, ప్రకృతి కారణంగా ఏదైనా వైకల్యం కలిగితే వారిని ఎత్తిచూపడానికి వికలాంగులు అని గతంలో పేరు ఉండేదని, ప్రధాని నరేంద్రమోడి మొదటిసారిగా వారి లోపాలను ఎత్తిచూపకుండా చేయూతను అందిస్తే అద్భుతాలను సృష్టిస్తారని దివ్యాంగులు అని నామకరణం చేశారన్నారు. రైల్వేలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం అనేక నిబంధనలను సవరించి తొందరగా సర్టిఫికేట్ తీసుకొనేలా మోడి చొరవ చూపారు. దివ్యాంగుల దినోత్సవంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు ఎదురుకుంటున్న సమస్యలను నరేంద్రమోడి నాయకత్వంలో విద్యారంగం, ఉద్యోగాలలో, రిజర్వేషన్లలో న్యాయం చేసేలా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత సంవత్సరం గద్దెనెక్కిన మోసగాడి ప్రభుత్వం దివ్యాంగులను కూడా మోసం చేసిందన్నారు. యేడాదిపాలన విజయోత్సవాలపేరిట తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని, ఈ ఉత్సవాలలో దివ్యాంగులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీ తరఫున, దివ్యాంగుల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నాం.

## రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానం అమలు చేయండి


### సిఎం రేవంత్‌రెడ్డికి బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానం అమలు చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకట రమణా రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి లేఖ రాశారు. దేశ ఆర్థికాభివృద్ధితో పాటు మానవ అభివృద్ధి, విద్యా వ్యవస్థపై ఆధారపడి ఉంటుందని, ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని విద్యావిధానంను సంపూర్ణంగా సంస్కరించవలసిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా నాణ్యమైన విద్య మాత్రమే వ్యక్తులను దేశానికి పనికొచ్చే వనరుగా తయారు చేస్తుందని లేఖలో పేర్కొన్నారు. గడిచిన 10 సంవత్సరాల్లో గత ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇలానే కొనసాగితే తెలంగాణ విద్యావ్యవస్థలో అధమ దశలో ఉండే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తేరుకొని రాబోయే తరాలకు న్యాయం చేయాలని లేఖలో పేర్కొన్నారు. యుడిఐఎస్‌సి నివేదిక ప్రకారం దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలైన కర్ణాటక ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల కంటే కేవలం తెలంగాణలో మాత్రమే ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అధికంగా ఉందని అన్నారు. ఇది రాష్ట్ర విద్యా వ్యవస్థకు, రాష్ట్ర పిల్లల సమగ్ర అభివృద్ధికి మంచిది కాదన్నారు. నార్త్‌లో వివిధ రాష్ట్రాల్లో పాఠశాల విద్యపై ఏర్పాటై అమలవుతున్న ఎఫ్ఆర్‌సిని తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం లేదని గుర్తు చేశారు. అలాగే రాష్ట్ర చరిత్రలో ఏ సిఎంకు రాని అవకాశం రేవంత్ రెడ్డికి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానం అమలుకు విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న సిఎం పొలిటికల్ విల్ నిర్ణయం తీసుకొని తెలంగాణలో కామన్ స్కూల్ విధానం తీసుకొచ్చి తెలంగాణ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యపై పెడుతున్న అనవసర ఖర్చును నివారించడమే కాకుండా "జాతీయ పునర్నిర్మాణంలో గొప్ప ముందడుగు తెలంగాణ నుంచి పడేలా కృషి చేయాలని వెంకట రమణారెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

## గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలి

### ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 15,16 తేదిల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డ్(ఆర్ఆర్‌బీ)(జేఈ) నిర్వహించే పరీక్షల నోటిఫికేషన్ గత 8 సంవత్సరాల తర్వాత విడుదల చేశారని.. అదే సందర్భంలో గత కొన్ని సంవత్సరాల తరువాత తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-2 నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నారని సంఘం నేతలు తెలిపారు. అయితే రెండు పోటీ పరీక్షలు ఒకేరోజు ఉన్నాయని.. దానివల్ల అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఆర్ఆర్‌బీ(జేఈ) పరీక్షలు ఈ నెల 16 నుండి 18 వరకు జరగనుండగా.. గ్రూప్-2 పరీక్షలు ఈ నెల 15, 16 తేదీల్లో ఉన్నాయన్నారు. గ్రూప్-2 పరీక్ష 16 వ తేదీన ఉదయం, సాయంత్రం రెండు పూటలు ఉంటుందని.. దానికి సుమారు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారి తెలిపారు. గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేసి.. నిరుద్యోగ అభ్యర్థులకు నష్టం జరగకుండా త్వరలో గ్రూప్-2 పరీక్షలని నిర్వహించాలని సంఘాల నాయకులు కోరుతున్నారు.



## రోజుకు 2.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

### క్రమశిక్షణ లేకుంటే చర్యలు తప్పవు

### సింగరేణి సిఎండి బలరాం హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రోజుకు 2.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలి 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీయాలని సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశించారు. అంతేకాకుండా ఉత్పత్తిలో నాణ్యత, రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం ఏరియా జీఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని సింగరేణితో ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గును సరఫరా చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న 120 రోజుల్లో ప్రతీ నిమిషం విలువైనదని చెప్పారు. ఉత్పత్తి లక్ష్య సాధనకు అన్ని ఏరియాలు సమష్టిగా కృషి చేయాలన్నారు. గనులలో ప్రతీ నిమిషం ఉత్పత్తికి కీలకమైనదని, ఆలస్యంగా ఉత్పత్తి కార్యకలాపాలు జరగకుండా ప్రతీ గని మేనేజర్, ప్రాజెక్టు అధికారి చొరవ తీసుకోవాలన్నారు.

ప్రతీ ఒక్కరూ విధిగా 8 గంటల పాటు పనిచేసేలా చూడాలని, క్రమశిక్షణ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే కంపెనీ యంత్రాల పనితీరును మెరుగుపరచాలని, కనీసం 18 గంటలు వినియోగించేలా చూడాలన్నారు. నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడం ద్వారా సింగరేణి వినియోగదారులను కాపాడుకోగలమని, పోటీ మార్కెట్లో నిలదొక్కుకో గలమన్నారు. స్వీయ రక్షణ కు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, తద్వారా ప్రమాదాలను నివారించ వచ్చన్నారు. నూతన ప్రాజెక్టులైన కొత్తగూడెంలోని వీకే ఓసీ, ఇల్లందులోని రోంపేడు ఓసీలో వచ్చే మూడు నెలల్లో ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చూడాలన్నారు.

అదే సమయంలో ఒడిశా నైనీ బ్లాక్లో చెట్ల గణన కొంత పూర్తయిన నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తితో ముడిపడిన ఇతర కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, వేంకటేశ్వరరెడ్డి, జీఎంలు ఎం.సుభానీ, డి.రవిప్రసాద్, కార్పోరేట్ జీఎంలు, ఏరియా జీఎంలు పాల్గొన్నారు.

## పుష్ప-2 సినిమా టికెట్ ధరలను తగ్గించాలి

### డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 5న రిలీజ్ అవుతున్న పుష్ప 2 సినిమా టికెట్ ధరలను తగ్గించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం మరియు ఫిలిం ఇండస్ట్రీ కమిటి పుష్ప 2 సినిమా రేట్లను పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ తెలిపారు. ప్రతి సినిమా విడుదల సందర్భంగా టిక్కెట్ల ధరలు పెంచడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఈనెల 5న రిలీజ్ అవుతున్న పుష్ప 2 సినిమాకి ప్రీ రిలీజ్ రోజు టికెట్ రేట్లు సుమారుగా రూ. 800 పైనే పెంచారని.. అలాగే 5న రిలీజ్ అవుతున్న సందర్భంగా ఆ రోజు నుంచి రూ. 300, రూ. 400, రూ. 500 పైనే టికెట్ ధరలను పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. టిక్కెట్ల ధరలను పెంచడం వల్ల ప్రేక్షకులపై భారం పడుతుందని.. దీంతో సినిమా వినోదానికి వారు కావల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కాబట్టి పుష్ప2 సినిమా టికెట్ల రేట్లు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బీచ్‌లో ధ్యానంచేస్తూ సముద్రంలో కొట్టుకుపోయిన రష్యా నటి



బ్యాంకాక్, డిసెంబరు 3: థాయిలాండ్‌లోని కోహ్ సముయి ద్వీపం బీచ్‌లో యోగా చేసుకుంటున్న రష్యా నటి కమిల్లా బెల్యాస్కకాయ అతిపెద్ద అలవచ్చిపడటంతో ఆమె సముద్రంలో కొట్టుకుని పోయింది. 24 ఏళ్ల నటి విహార యాత్రనిమిత్తం తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి వచ్చింది. బీచ్‌లో సముద్రపుఒడ్డున రాళ్లపై ధ్యానం చేసుకుంటున్న సమయంలో అనుకోకుండా పెద్ద సముద్రపు అల ఆమెను చుట్టుముట్టింది. అత్యంత వేగంగా వచ్చిన ఈ సముద్రపు అల అంతేవేగంతో ఆమెను సముద్రంలోకి లాగేసింది. దీనితో ఆమె కొన్నికిలోమీటర్లమేర సముద్రంలో కొట్టుకునిపోయింది. ఈస్పాట్ అంటే తనకు ఎంతో ఇష్టమని అందుకే తరచూ ఇక్కడకు వస్తుంటానని ఇదే తనకు సొంతిల్లుగా భావిస్తానని, భూమిపై అత్యుత్తమ విశ్రాంతి ప్రదేశమని కూడా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టింది. తనజీవితంలో ఇంతటి సుందరప్రదేశం ఎప్పుడూ చూడలేదని తానెంతో సంతోషంగా ఉన్నట్లు పోస్టులు కూడా పెట్టింది. ఇది జరిగిన కొద్దిసేపటికే సముద్రపు అల ఆమెను తనలోకి లాగేసుకుంది. సహాయక బృందాలు తక్షణమే స్పందించాయి. 15నిమిషాల్లోనే కొట్టుకుపోతున్న నటివద్దకు చేరాయి. అయితే తీవ్రస్థాయిలో అలలు రావడంతో ఆమెను రక్షించలేకపోయారు. ఈ ద్వీపం బీచ్‌లలో హెచ్చరికలు జారీచేసి ఉన్నాయని కొంతమేర ప్రమాదం కూడా ఉందని, రుతుపవనాల సీజన్‌లో పర్యాటకులను తరచూ హెచ్చరిస్తుంటామని అయినా అనుకోకుండా ఇలాజరిగిపోతున్నట్లు వివరించారు.

# హరీశ్‌రావు, రాధాకిషన్‌రావుపై చర్యలు తీసుకోవాలి

## సిద్దిపేట కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: తన ఫోన్ ట్యాప్ చేయడంతో పాటు బెదరింపులకు పాల్పడిన హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008లో తాను స్థిరాస్తి వ్యాపారం ప్రారంభించానని 2021 మార్చిలో పంజాగుట్ట నాగార్జున సర్కిల్‌లో ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపునకు మళ్లించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రోత్సహించా నన్నారు. 2022లో ఆత్మహత్యకు పాల్పడిన వంద మంది రైతు కుటుం బాలకు ఒక్కొక్కరికి లక్ష చెప్పున కోటి రూపాయల ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. అలాగే గతేడాది మార్చిలో రైతు కుటుంబాలకు చెందిన 150మంది భర్తలు కోల్పోయిన వితంతులకు లక్ష రూపాయల చొప్పున నగదును పంపిణీ చేశానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేసహా ఏ ఇతర రాజకీయ నేతలను ఆహ్వానించ లేద న్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా తనకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో స్థానిక ఎమ్మెల్యే, అప్పటి మంత్రి అయిన హరీశ్‌రావు తనపై కక్ష పెంచుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి హరీశ్‌రావు అతని అనుచరుల నుంచి బెదరింపులు ప్రారంభమ య్యాయని వివరించారు. అగ్గిపెట్టెల పరిశ్రమను ప్రారంభిస్తే దానికి అనుమతులు లేవని అరెస్టు చేయించి జైలుకు పంపారని తెలిపారు. జైలు నుంచి పది రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాయని అప్పటి నుంచి గుర్తు తెలియని ఫోన్‌నెంబర్ల నుంచి తనకు సందేశాలు వస్తున్నాయని అందులో తనను చంపేస్తానని హెచ్చరించారని చక్రధర్ గౌడ్ పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు తనపై హరీష్‌రావు అగ్రహంగా ఉన్నారని వెంటనే బీఆర్ఎస్ పార్టీలో చేరాలని తమ మాట వినకుంటే తన చాప్టర్ క్లోజ్ చేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు.

# బిఆర్ఎస్ నాయకులను వీడని ఫోన్‌ట్యాపింగ్

## హరీశ్‌రావు, మాజీ డిసిపి రాధాకిషన్‌రావుపై పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు బిఆర్ఎస్ నాయకులను వీడడం లేదు. ఇప్పటికే బిఆర్ఎస్‌కు చెందిన ప లువురు నాయకులపై ఫోన్ ట్యాపింగ్ కేసులో అభియోగాలు రావడం తెలిసిందే. తాజాగా ఇదే కేసుకు సంబంధించి ఆ పార్టీకి చెందిన మాజీ నాయకుడు బాచుపల్లికి చెందిన ప్రస్తుత బిజెపి నేత చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావుపై పంజాగుట్ట పో లీసు స్టేషన్‌లో మంగళవారం నాడు కేసు నమోదయ్యింది. వీరిపై ఐపిసి 120 బి, 386, 409తో పాటు ఐటి యాక్ట్ 2008 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం లో వున్న సమయంలో తన ఫోన్‌ను నాటి టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు బలవంతంగా తీసుకుని కొన్ని రోజుల తరువాత తిరిగి ఇచ్చా రని, దీని తరువాత తన ఫోన్ ట్యాపింగ్‌కు గురయ్యిందని చక్రధర్ గౌడ్ తన ఫిర్యాదులో తెలిపారు. హరీష్ రావుతో పాటు రాధాకిషన్ రావు తనను వేధించారని బా ధితుడు తెలిపారు. కాగా దీనిపై విచారణ చేస్తున్నట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాధాకిషన్ రావు ఇప్పటికే అరెస్టయి ఎనిమిది నెలలుగా చంచల్‌గూడ జైల్లో వుండడం తెలిసిందే.



మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

# కాంగ్రెస్ చేస్తున్న సంబరాలు ఎవరి కోసం?

## బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంబరాలు ఎవరి కోసం చేస్తున్నారని వారికే అర్థం కావడం లేదని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సుప్రింకోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటలకే వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని రేవంత్ రెడ్డి చెప్పారని అన్నారు. దేశంలోనే వర్గీకరణ చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పినా, ముఖ్యమంత్రి ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. రాజకీయంగా మాదిగలను ముంచింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. సబ్‌ప్లాన్‌ను ముఖ్యమంత్రి నిర్వీర్యం చేస్తుంటే ఉప ముఖ్యమంత్రి, స్పీకర్ నోరు మెదపడం లేదని, మాలలను ఒక కాంగ్రెస్ నాయకుడు రెచ్చ గొడుతున్నారన్నారు. మాదిగలను ఒక వెపు ముంచి, మరో వెపు మాలలను రెచ్చ గొడుతున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ విధానం స్పష్టం చేయాలన్నారు. అంబేద్కర్‌ను చట్ట సభల్లో అడుగు పెట్టకుండా ఓడించి, అవమానించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న కెసిఆర్ చెయ్యకుండా పబ్బం గడిపారని, ఎస్సీ వర్గీకరణను దేశంలో అమలు చేసిన ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతానని రేవంత్ రెడ్డి చెప్పారని, ఛార్జ్ షీట్ పెట్టే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు.

# ప్రజావాణిలో సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నాం

## మంత్రి పొన్నం, ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య



హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య తెలిపారు. ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించడం ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మంగళవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా భూ సమ స్యలు, లా అండ్ ఆర్డర్ ఇతర వినతులు స్వీకరించిన మంత్రి పొన్నం, చిన్నారెడ్డి, సిరిసిల్ల జిల్లాలో తమపై అక్రమంగా నమోదైన కేసులపై మహిళ ప్రజావాణిలో చెప్పగానే వెంటనే ఎస్పీతో మాట్లాడి పరిష్కరించారు. బోధన్, మెట్‌పల్లి, మెదక్, నిజాం షుగర్స్ కర్మాగారాలలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలను ఇప్పించాలని కోరుతూ ప్రజావాణిలో కార్మికులు ఆర్జీలను ఇచ్చారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరలోనే జీతాల సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. బేగంపేట్, అమీర్‌పేట్ సహా పలు ప్రాంతాల్లోని హాకర్స్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం, చిన్నారెడ్డి, దివ్య తెలిపారు. 61 సంవత్సరాల వయస్సు నిండిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌ల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం త్వరలోనే పరిష్కార మార్గం చూపిస్తుందనీ, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని సూచించారు. కాగా, ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 430 దరఖాస్తులు అందాయి. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి 114, మైనార్టీ సంక్షేమ శాఖ 126, విద్యుత్ శాఖ 54, రెవెన్యూ శాఖ 46, హోం శాఖ 20, ఇతర శాఖలకు 70 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని మంత్రి పొన్నం, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య వెల్లడించారు.

# ప్రభుత్వం మాటవినని ట్రెజరీ శాఖ!

## అక్టోబర్ 10 నుంచి కాకుండా16 నుంచి వేతనాలిచ్చారు

## 10 జిల్లాల్లో కొత్త డిఎస్సీ ఉపాధ్యాయులకు వేతనాలు

## మరో 20 జిల్లాల్లో ఎదురుచూస్తున్న వైనం

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: ఎట్టకేలకు రాష్ట్రంలో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు వేతనాలు మంజూరు చేశారు. వేతనాల మంజూరులో ప్రభుత్వం చెప్పినట్టుగా కాకుండా.. సర్వీస్ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు విధుల్లో చేరిన తేదిల ప్రకారమే వేతనాలను మంజూరు చేస్తూ ట్రెజరీ శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో అక్టోబర్, నవంబర్ రెండు నెలల వేతనాలను ట్రెజరీ శాఖ మంజూరు చేసింది. అదీ కూడా రాష్ట్రంలోని అన్నీ జిల్లాల్లో మంజూరు కాలేదు. కేవలం 10 జిల్లాల్లోనే వేతనాలు జమ అయ్యాయి. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అక్టోబర్ 9న నియామక పత్రాలు అందుకున్న డీఎస్సీ-2024 ఉపాధ్యాయులకి అక్టోబర్ 10 నుంచి వేతనాలు వస్తాయని సీఎం సమక్షంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రకటించినప్పటికీ.. అక్టోబర్ 10 నుంచి కాకుండా.. ఉపాధ్యాయులు పాఠశాలల్లో చేరిన అక్టోబర్ 16 నుంచి వేతనాలను మంజూరు చేశారు.

డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన కొత్త టీచర్లకి తొలి వేతనాలు సోమ, మంగళవారాల్లో సుమారు 10 జిల్లాల్లో క్రెడిట్ అయ్యాయి. అయితే ఉపాధ్యాయులు, పాఠశాల విద్య శాఖ చెప్పినట్టుగా అక్టోబర్ 10 నుంచి కాకుండా అక్టోబర్ 16 నుండే వేతనాలు కౌంట్ చేసి మంజూరు చేశారు. ఒకేసారి అక్టోబర్ మరియు నవంబర్ వేతనాలు జమ అయ్యాయి. సిద్దిపేట, ములుగు, సంగారెడ్డి, హైద్రాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో వేతనాలు జమ అయినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. మరో 20 జిల్లాల్లో ఇంకా ఎంప్లాయ్ నంబర్లు.. పాన్ నంబర్ల విషయంలో పెండింగ్ ఉన్నందున వారికి వేతనాలు జమ కావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అందరికీ ఒకటి, రెండు రోజుల్లో వేతనాలను జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# లాన్‌టెన్నిస్ పోటీలో స్వర్ణ పతకం సాధించిన ఐజి చంద్రశేఖర్‌రెడ్డి జోడీకి డిజిపి అభినందనలు

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: బెంగళూరులో జరిగిన పోలీసు, పారా మిలటరీ బలగాల లాన్ టెన్నిస్ పోటీల్లో 50 ఏళ్ల పైబడిన వయో కేటగిరిలో బం గారు పతకం సాధించిన తెలంగాణ మల్టీ జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి జోడిని డిజిపి అభినందించారు. మంగళవారం నాడు తన కార్యాలయంలో జరిగిన ఓ కార్య క్రమంలో మల్టీ జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ఆయనతో పాటు కలిసి ఆడిన నారాయణ్‌పేట్ సాయుధ బలగం అదనపు ఎస్పీ మహమ్మద్ రియాజ్‌లను డిజిపి అభినం దించి పోటీలు సాగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. బెంగళూరులోని కెఎస్ఎల్‌జిఎ స్టేడియంలో నవంబర్ 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ పోటీలు జ రగడం తెలిసిందే. ఫైనల్‌లో ఐజి చంద్రశేఖర్ రెడ్డి జోడీ ఎపికి చెందిన డిఎస్‌పిలు రాంకుమార్, సత్యనారాయణల జోడిని 9..6 పాయింట్లతో ఓడించడం విదితమే.



లాన్ టెన్నిస్ పోటీల్లో బంగారు పతకం అందుకున్న తెలంగాణ మల్టీ జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి జోడిని అభినందిస్తున్న డిజిపి జితేందర్

# రుద్ర టెక్నాలజీ నుంచి కాలుష్యవ్యర్థాల విడుదల

## పరిశ్రమ మూసివేతకు పిసిబి ఆదేశం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 3: కాలుష్య వ్యర్థాలను విడుదల చేస్తున్న రుద్ర టెక్నాలజీ పరిశ్రమను మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలి మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వివరాలలోకి వెళితే.. అత్తాపూర్ బాపు ఘాట్ బ్రిడ్జి వద్ద కెమికల్ వ్యర్థాలను మూసీనదిలో కలుపుతున్న ట్యాంకర్లను స్థానికులు నెల 26వ తేదిన రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాండూర్, పటాన్ చెరు, షాద్ నగర్ సహా వివిధ ప్రాంతాలకు చెందిన కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలను తీసుకువచ్చి ఈ ప్రాంతంలో డంప్ చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. మూసీ వెంబడి ఖాళీ స్థలాన్ని కబ్జా చేసిన కొంతమంది వ్యక్తులు.. అక్కడ ఇసుక వ్యాపారం, లారీల పార్కింగ్ పెట్టారు. ఎవ్వరికీ అనుమానం రాకుండా నదిలో వ్యర్థాలు కలుపుతున్నారు. ఇదే క్రమంలో కెమికల్ వ్యర్థాలు ఖాళీ చేస్తున్న లారీని మాత్రం పట్టుకోగలికారు.

సమాచారాన్ని పోలీసులకు, కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు స్థానికులు.. అధికారులు అక్కడికి వచ్చి ఎపి 28 టిడి 4699 నెంబర్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు. ఇందులోని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి సేకరించిన వివరాల అధారంగా రుద్రా టెక్నాలజీస్ (శ్రీనివాస ల్యాబ్స్) ఈ వ్యర్థాలను మూసిలో గత కొంత కాలంగా కలుపుతున్నట్లు తేలింది. భారీ ట్యాంకర్ కావడంతో ట్రిప్పునకు రూ.25వేలు చెల్లిస్తున్నట్లు డ్రైవర్ వెల్లడించాడు. ఒక్కో ట్యాంకర్‌లో 20వేల లీటర్ల వ్యర్థాలు పడతాయని, అలాంటివి రోజుకు 10ట్యాంకర్లు వస్తున్నట్లు కాలుష్య నియంత్ర మండలి అధికారులు గుర్తించారు.

ఈ నేపథ్యంలోనే రుద్రా టెక్నాలజీస్ (శ్రీనివాస ల్యాబ్స్)కు కాలుష్య నివారణ మండలి నోటీసులు జారీ చేసింది. వారి నుంచి సంతృప్తికర సమాధానం రాకపోవడంతో రుద్రా టెక్నాలజీస్‌ను వెంటనే మూసి వేయవలసిందిగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# నాగమణి హత్య కేసులో నిందితుడు రిమాండ్


## పరారీలో అచ్చన శివ

## గాలింపు చేపట్టిన మూడు పోలీసు బృందాలు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 3, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, రాయపోల్ గ్రామంలో సోమవారం కానిస్టేబుల్ నాగమణి ని హత్య చేసిన నిందితుడిని మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసులు రిమాండ్ చేశారు. కాగా నిందితునికి సహకరించిన అచ్చన శివ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు. సిఐ సత్యనారాయణ తెలిపిన కథనం మేరకు.. నిందితుడు పరమేష్ కు ఇద్దరు అక్కలు హైమావతి, నాగమణి ఉన్నారు. పరమేష్ తల్లిదండ్రులు కొంగర రమేష్, పద్మలు అనారోగ్యంతో సుమారు పది సంవత్సరాల క్రితం మృతి చెందారు. అప్పటినుండి పరమేష్ అక్కలతో కలిసి మామ సంరక్షణలో ఉంటున్నారు. కాగా మృతురాలు నాగమణి అదే గ్రామానికి చెందిన బండారి శ్రీకాంత్ అనే వ్యక్తితో ప్రేమలో ఉంది. ఇదిలా ఉండగా నాగమణికి ఎనిమిది సంవత్సరాల క్రితం పెద్దలు కుదిరిచి వివాహం జరిపించారు. కొన్ని సంవత్సరాలకే ఆ వ్యక్తితో నాగమణి విడాకులు తీసుకుంది. ఆ తర్వాత శ్రీకాంత్ తో కలిసి నగరంలోని వనస్థలిపురం సహారా ఎస్టేట్స్ లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నారు. నాగమణికి పెళ్లి సమయంలో కట్నంగా ఒక ఎకరా భూమిని ఇచ్చారు. నాగమణి విడాకులు తీసుకున్న తర్వాత శ్రీకాంత్ తో గత నెల నవంబర్ 10 న యాదగిరిగుట్ట లో వివాహం చేసుకున్నారు. అప్పటినుండి పరమేష్ తన అక్క తనకు ఇష్టం లేని వివాహం చేసుకుంది అని కక్షయ పెంచుకున్నాడు. మొదటి వివాహం సమయంలో అక్కకు ఇచ్చిన భూమి తిరిగి ఇవ్వాలని కోరగా తిరిగి ఇచ్చేసింది. కాగా తిరిగి మరలా భూమి ఇవ్వాలని తమ్ముడైన పరమేష్ నాగమణి ఒత్తిడి తెచ్చింది. ఇప్పటికే మృతురాలు నాగమణి, బండారి శ్రీకాంత్ తో కులాంతర వివాహం చేసుకుందని గ్రామంలో బంధువుల ముందు తలదించుకోవాల్సి వస్తుందని మరల భూమి అడగడంతో అక్క పై కోపం పెంచుకున్నాడు. అప్పటినుండి ఎలా చంపాలి అని పథకం వేశాడు. పథకం ప్రకారం ముందుగానే కారులో చంపడానికి అవసరమైన కత్తి ఏర్పాటు చేసుకున్నాడు. కాగా ఆదివారం మృతురాలు నాగమణి తన అత్తారింటికి వచ్చిందని తెలుసు కున్నాడు. పరమేష్ స్నేహితుడితో నాగమణి కదలికలు ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ ఉన్నాడు. సోమవారం ఉదయం ఉద్యోగరీత్య హయత్ నగర్ పోలీస్ స్టేషన్ కు వెళుతుండగా అచ్చన శివ ఎలా వెళుతుంది ఏమిటి అని నిందితుడైన పరమేష్ కు ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు సమా చారం అందించారు. దీంతో రాయపోల్ నుండి మన్నెగూడ మీదుగా హయత్ నగర్ ఉద్యోగానికి వెళుతున్న క్రమంలో కారుతో వెంటాడి వెనుక నుండి ద్వి చక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. నాగమణి వాహనం పై నుండి కింద పడింది. వెంటనే పరమేశ్ కారు దిగి పథకం ప్రకారం ముందుగానే తన వద్ద ఉంచుకున్న కమ్మ కత్తితో మెడపై నరికాడు. నాగమణి అక్కడికక్కడే మృతిచెందింది. సోమవారం మృతురాలు నాగమణి భర్త శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పరమేష్ పై పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్ కు తరలించారు. పరమేష్ కు సమాచారం ఇచ్చిన అచ్చన శివ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి శివ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



నిందితుడు పరమేష్‌ను రిమాండ్ తరలిస్తున్న పోలీసులు




# వరద ముప్పును అధిగమించేందుకు ప్రణాళికలు

## హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: నగరంలో వరద ముప్పును అధిగమించేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని చెరువుల పునరుద్ధరణ, వాటి అనుసంధానంపై దృష్టి పెట్టామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈమేరకు మంగళవారం హెచ్ఐసీసీ లో 'జియో స్మార్ట్ ఇండియా 2024' సదస్సులో సాంకేతిక పరిజ్ఞానంతో విపత్తు నిర్వహణ, వాతావరణ మార్పులపై హైడ్రా కమిషనర్ శ్రీ రంగనాథ్ గారు ప్రసంగించారు. వర్షాకాలం వరద ముప్పు లేని నగరాలు అనే అంశం పెద్ద సవాల్‌గా మారిందన్నారు. రెండు సెంటీమీటర్ల వర్షం పడినా ట్రాఫిక్ జామ్ లు ఏర్పడుత్నుయని దీంతో ఇంధనంతో పాటు సమయం వృధా అవుతుందన్నారు. నగరంలో కేవలం 0.95 శాతం వర్షం నీరు మాత్రమే భూమిలోకి యింకుతోంది. నివాస ప్రాంతాలు పెరగడం, చెరువులు నాలలు కబ్జాకు గురి కావడం వల్ల వరద కాలనీలను, రహదారులను ముంచెత్తుతోందని అందుకే చెరువుల పునరుద్ధరణ చేపట్టి నాలాల ఆక్రమణ తొలగింపుపై దృష్టి పెట్టామన్నారు. అలాగే పార్కులను, ప్రభుత్వ స్థలాలు కాపడుతున్నామన్నారు.

అమీన్ పూర్ చెరువు పరిసరాల్లో ఆక్రమణల తొలగించడంతో వలస పక్షులు వస్తున్నాయని అమీన్‌పూర్ సరస్సులోకి తూర్పు యూరప్ నుంచి వలస వచ్చిన 12సెంటీమీటర్ల రెడ్ బ్రెస్టెట్ ఫ్లైక్యాచర్ (పక్షి) మనం సరైన మార్గంలోనే వెళ్తున్నామని సూచిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సామాజిక మాధ్యమంద్వారా అభినందించడం ఆనందించదగ్గ విషయం అన్నారు. తాము చెరువుల చుట్టుకొలత లెక్కలు తేల్చే పనిలో వున్నామని యీ క్రమంలో వాతావరణ శాఖ సహకారం ఎంతో అవసరం అన్నారు. ప్రస్తుతం వెదర్ రాడార్ ఒక్కటే వుందని వీటి సంఖ్య పెంచాలన్నారు. సాంకేతికత పెంచుకుని వర్షం రాకను, ఎంత మొత్తంలో వస్తోంది... ఏప్రాంతా లకు వరద ముప్పు అనే సమాచారం ప్రజలకు కచ్చితంగా అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

అలాగే ముప్పు వున్న ప్రాంతాల సమాచారం, కరువు కాటకాలకు సంబంధించి సమగ్ర సమాచారం తెలుసుకునే వెసులుబాటు వుంటుందని యీ సమాచారంతో ప్రకృతి వైపరీత్యాలను అంచనా వేసి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ శాఖలతో పాటు యితర ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను శ్రీ రంగనాథ్ గారు సందర్శించారు.

# వన్యప్రాణుల సంరక్షణలో అత్యంత ప్రాధాన్యత అవసరం

## దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త : ప్రకృతి సహజ ధర్మాలకు విఘాతం కలుగకుండా వ్యవహరించడమే మనుషులుగా వన్యప్రాణుల సంరక్షణకు మనం నిర్వర్తించే అత్యుత్తమ విధి అని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంత్రి సురేఖ వన్య ప్రాణుల సంరక్షణకు పాటుపడుతున్న అటవీ శాఖ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్య ప్రాణులు, వృక్ష సంపద, మనుషలకు మధ్య అవినాభావ సంబంధం ఉందనీ, వీటి కొనసాగింపు ఒక లయలో కొనసాగితేనే జీవ వైవిధ్యం వర్ధిల్లి మనుషులుగా మనకు మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు.

వన్య ప్రాణుల సంరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, ఇందుకు సంబంధించి కట్టుదిట్టమైన కార్యాచరణతోముందుకు సాగుతున్నదనఇ చెప్పారు. వన్య ప్రాణుల సంరక్షణ చట్టాన్ని నిబద్ధతతో అమలు చేయడంతో పాటు వన్యప్రాణుల వేట, జంతువుల అక్రమ వ్యాపారాన్ని నివారించడానికి క్యాచ్ ద ట్రాప్ పేరుతో తెలంగాణ అటవీ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు. వన్య ప్రాణుల సంరక్షణకు ఎంతో నిబద్ధతతో కార్యక్రమాలు అమలు చేస్తూనే అరుదైన వన్యప్రాణులైన పులుల సంరక్షణకు కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దుతున్నట్లు ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలకు రూ.108.60 కోట్లు విడుదల

## మంత్రి పొంగులేటి చొరవతో 30 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం

ఖమ్మం రూరల్, ప్రభాతవార్త: జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ సముదాయలకు రాష్ట్రప్రభుత్వం రూ.108.60కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్రమైన ఖమ్మం సమీపంలోని పాలేరు నియోజకవర్గంలో గల మద్దులపల్లి సమీపంలో ఇంజనీరింగ్ కాలేజిని 2023లో ఆనాటి ప్రభుత్వం మంజూరు చేసింది. అరకొర వసతులతో రెండేళ్లుగా ఐటిడిఏ భవనంలో కళాశాలను నడుపుతున్నారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖ, పౌర సమాచార శాఖ మంత్రి నియోజకవర్గం కావడంతో మంత్రి సిఎంతో మాట్లాడి ఈ నిధులను విడుదల చేయించారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ మూడు రోజులక్రితం జీవో విడుదల చేయగా మంగళవారం ఈ ప్రకటన వెలువడింది. 30ఎకరాల విస్తీర్ణంలో కళాశాల భవన సముదాయన్ని నిర్మించనున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో డేటాసైన్స్, సిఎస్ఈ, ఈసిఈ, ఈఈఈ, మెకానికల్, కోర్సులను రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క కోర్సుకు 60మంది విద్యార్థులు చొప్పున 300మంది విద్యార్థులు ప్రస్తుతం ఈ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. అరకొర వసతులతో కనీస సౌకర్యాలు లేకపోవడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ చూపించి ఈ నిధులను మంజూరు చేయించారు.

# తెగిపోయిన గూడ్స్‌రైలు లింక్

## పలు రైళ్లకు అంతరాయం

మహబూబాబాద్, డిసెం బరు 3, ప్రభాతవార్త: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు లింక్ తెగిపోవడంతో పలు రైళ్లకు అంతరాయం ఎర్పడింది. వివరాల్లోకి వెళితె.. 436/12కిలో మీటరు రాయి వద్ద గూడ్స్ రైలు లింక్ తెగి రెండుగా విడిపోయింది. గమనించిన రైల్వే గార్డు లోకో పైలెట్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే రైలును నిలిపివేశారు. సమా చారం తెలుసుకున్న రైల్వే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ముందుకు వెళ్లిన గూడ్స్ ఇంజన్‌ను వెనక్కి రప్పించి విడిపోయిన మూడు బోగిలను జతచేసి మరామత్తులు చేపట్టి రైలును అక్కడి నుండి పంపించారు. దీంతో 45నిమిషాల పాటు రైళ్లు ఆలస్యంగా నడువడంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



ఆట



# డబ్ల్యూటిసి పోరు రసవత్తరం

## ఫైనల్స్‌పై వీడని సందిగ్ధత అర్హత సాధించే జట్లేవి?

**ఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25కి సంబంధించి సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో భారత్ ఉన్నప్పటికీ ఫైనల్‌కు చేరుతుందో లేదోనని ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి న్యూజిలాండ్‌తో స్వదేశంలో మూడు టెస్టుల సిరీస్ వరకు భారత్‌కు ఫైనల్ చేరిక నల్లేరుపై నడకలానే సాగింది. సొంతగడ్డపై కివీస్ చేతిలో మూడు టెస్టుల సిరీస్‌లో 0-3తో వైట్ వాష్ అయ్యాక తుదిపోరు అవకాశాలు క్లిష్టమయ్యాయి. ఫైనల్‌కి అర్హత సాధించాలంటే కనీసం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ) లో కనీసం 40తో భారత్ విజయం సాధించాల్సి ఉంది. అయితే పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో 295 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన టీమిండియా తన ఆశలను సజీవంగా ఉంచుకుంది. దీనికి తగిటనట్లుగా బ్యాటర్లు ఫామ్‌లోకి రావడం ఒకింత సానుకూలాం శమైంది. ఇక ఫైనల్‌కి చేరుకునే అవకాశం భారత్‌తో పాటు సౌతాఫ్రికా, ఆస్ట్రేలియాకు ఉన్నాయి. భారత్‌తో పాటు శ్రీలంకతో కలిపి మరో 6 టెస్టులు ఆడాల్సిన ఆస్ట్రేలియా. అందులో కనీసం 4 టెస్టులైనా విజయం సాధించా లి. ఆ తర్వాత ఇతర జట్ల సమీకరణాలపై ఆధారపడాలి. ఇప్పటికే పెర్త్ లో భారత్ చేతిలో ఓడి ఉండటం, బ్యాటర్లు ఫామ్ కోల్పోయిన క్రమంలో, టీమిండియాతో మిగతా 4 టెస్టుల్లో గెలవాలంటే ఆసీస్ చెమటోడ్చాల్సిందే. ఇక లంకతో దాని సొంతగడ్డపై 2 టెస్టుల సిరీస్ గెలవడం కంగారూలకు ఆషామాషీ కాదు. దీని కోసం కూడా చాలా కష్టపడాల్సిందే. మరోపక్క దర్బన్‌లో లంకతో జరిగిన తొలిటెస్టులో భారీ విజయం సాధించిన ప్రొటీస్. శ్రీలంక, పాకిస్తాన్‌లతో జరిగే మిగతా 3 టెస్టుల్లో విజయం సాధిస్తే నేరుగా ఫైనల్ బెర్తు దక్కించుకుంటుంది. ఈ మూడు మ్యాచ్‌లు సొంతగడ్డపై ఆడనుండటం సఫారీలకు సానుకూలాంశం. ప్రస్తుతం 59.26తో దక్షి ణాఫ్రికా రెండో స్థానంలో ఉంది. ఇక సఫారీల చేతిలో ఓడిపోయిన లంకకు డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు గల్లంతయినట్లే. ఇక ఇంగ్లాండ్ చేతిలో ఓడిన కివీస్ చేతిలో రెండు టెస్టులున్నాయి. ఇంగ్లీష్ టీమ్‌తో సొంతగడ్డపై జరిగే మిగతా 2 టెస్టుల్లో విజయం సాధించినా, న్యూజిలాండ్ ఫైనల్‌కి చేరడం కష్ట సాధ్యమే. కాగా డబ్ల్యూటీసీలో భారత్‌కు తిరుగులేని రికార్డు ఉంది. గత రెండు సీజన్లలోనూ అదిరే ఆటతో ఫైనల్ పోరుకు అర్హత సాధించింది. మరే జట్టు రెండుసార్లు ఫైనల్‌కి చేరకపోవడం గమనార్హం. అయితే 2021లో న్యూజిలాండ్ చేతిలో, 2023లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ తుదిపోరులో ఓడిపోయింది. అయితే ఈసారి మాత్రం ముందుగా ఫైనల్‌కు చేరుకుని, ఆ తర్వాత ట్రోఫీని దక్కించుకోవాలని రోహిత్ సేన పట్టుదలగా ఉంది. ఈ సీజన్‌లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఇప్పటివరకు దాదాపుగా అగ్రస్థానంలో తన ప్రస్థానం కొనసాగిస్తోంది. ఓవరాల్‌గా ఆరు సిరీస్‌ల్లో భాగంగా 15 మ్యాచ్‌లు ఆడిన రోహిత్ సేన, అందులో తొమ్మిందిటిలో విజయం సాధించి, ఐదింటిలో ఓడిపోయింది. మొత్తం 110 పాయింట్లతో 61.11 విజయాల శాతంతో టాప్ ప్లేసులో కొనసాగుతోంది. మొత్తం మీద సౌతాఫ్రికా, ఇంగ్లాండ్‌ల విజయాలతో డబ్ల్యూటీసీ ఫైనల్ పోరు రసవత్తరంగా సాగుతోంది.

### హాకీ ఛాంపియన్‌షిప్‌లో..
## లీగ్ దశలో వెనుదిరిగిన ఆంధ్ర జట్టు

**ఢిల్లీ:** ప్రత్యర్థి జట్టుపై గోల్స్ వర్షం కురపించినా జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు నాకౌట్ దశకు చేరుకోలేకపోయింది. రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్సలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు లీగ్ దశలోనే వెనుదిరిగింది. చివరిదైన గ్రూప్ హెచ్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 26-1 గోల్స్ తేడాతో పుదుచ్చేరి జట్టుపై భారీ విజయం నమోదు చేసింది. నాలుగు జట్లు ఉన్న గ్రూప్ హెచ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన మధ్యప్రదేశ్ జట్టు అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టింది. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక ఎనిమిది గ్రూపుల్లో టాప్ స్థానంలో నిలిచిన హరియాణా, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మిజోరం, ఢిల్లీ, పంజాబ్, మధ్య ప్రదేశ్ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. కాగా పుదుచ్చే రితో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయిలు ఆరంభం నుండి అదరగొట్టారు..6వ నిముషంలో మొదలైన గోల్స్ వేట 56వ నిముషం వరకూ కొనసాగింది. ఆంధ్రప్రదేవ్ అమ్మాయిలు అవకాశం దొరికిన ప్పుడల్లా పుదుచ్చేరి గోల్ పోస్ట్‌పై దాడులు చేసి అనుకున్న ఫలితం సాధించారు. ప్రధానంగా కెవటన్ కుప్పా తులసి చెలరేగిపోయింది. ఆమె ఏకంగా 9 గోల్స్ సాధించి అబ్బురపరచింది. తులసీ 6వ నిముషంలోను, 12, 21, 23, 32, 33, 34, 43, 56వ నిముషాల్లో గోల్స్ కొట్టింది. పూజారి మధురిమ బాయి 26వ నిముషంలోను, 39, 42, 47వ నిముషంలో 4 గోల్స్, మునిపల్లి నాగనందిని 16వ నిముషంలో, 28, 29, 54 నిముషాల్లో 4 గోల్స్, పరిగి లక్ష్మి 8వ నిముషం, 32, 37వ నిముషాల్లో3 గోల్స్, చిల్లూరు నాగతేజ 14వ నిముషం, 24వ నిముషంలో 2 గోల్స్, మండల వైష్టవి 19వ నిముషం, 45వ నిముషంలో 2 గోల్స్, ముజియా బేగం పఠాన్ 11వ నిముషంలో ఒక గోల్, తిరుమల శెట్టి జోష్నా 41వ నిముషంలో ఒక్క గోల్ చేశారు. ఇక పుదుచ్చేరి జట్టుకు నిలోవియా 28వ నిముషంలో ఏకైక గోల్ అందించింది.







## ఆసియా కప్: యువ భారత్ విజయం
### 211 పరుగుల తేడాతో జపాన్ ఓటమి

**ఢిల్లీ:** అండర్-19 ఆసియా కప్‌లో టీమిండియా భారీ విజయం సాధించింది. పసికూన జపాన్‌తోతో జరిగిన గ్రూప్ ఏ మ్యాచ్‌లో భారత్ 211 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 339 పరుగులు చేసింది. కెప్టెన్ మహ్మద్ అమోస్ అజేయ్ సెంచరీతో 122 పరుగులతో కదం తొక్కగా, ఓపెనర్ అయుశ్ మాత్రే మెరుపు అర్థ సెంచరీతో 29 బంతుల్లో 54 పరుగులు, 6 ఫోర్లు, 4 సిక్సర్లతో చెలరేగాడు. మిడిలార్డర్ బ్యాటర్ కేపీ కార్తికేయ బాధ్యతాయుతమైన అర్థ సెంచరీతో 49 బంతుల్లో 57 పరుగులు, 5 ఫోర్లు, ఒక సిక్స్‌తో రాణించారు. స్టార్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ 23 పరుగులు, అండ్రీ సిద్దార్థ 35 పరుగులు, నిఖిల్ కుమారి 12 పరుగులు, హర్వంశ్ సింగ్ 1 పరుగులు, హార్దిక్ రాజ్ 25 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. ఇక జపాన్ బౌలర్లలో కీఫర్ యమమోటో లేక్, హ్యూగ్ కెల్లీ తలో 2 వికెట్లు పడగొట్టగా, జార్లెస్ హింజే, అరవ్ తివారి చెరో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం 340 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జపాన్, భారత్ బౌలర్లు యుధాజిత్ గుహ 7-3-9-1, హార్థిక్ రాజ్ 8-2-9-2, చేతన్ శర్మ 8-0-14-2, కెపి కార్తికేయ 10-1-21-1తో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 128 పరుగులు మాత్రమే చేయగలిగింది. జపాన్ ఇన్నింగ్స్‌లో హ్యూగో కెల్లీ 50 పరుగులు, చార్లెస్ హింజే 35 పరుగులతో నాటౌట్‌గా, నిహార్ పర్మార్ 14 పరుగులతో రెండంకెల స్కోర్లు చేయగలిగారు. కాగా ఈ ఆసియా కప్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ముందు పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో యువ భారత్ ఓటమి పాలైంది.

# టి20 వరల్డ్ కప్ పాక్ కైవసం
### ఫైనల్స్‌లో బంగ్లాదేశ్ ఓటమి



**ఢిల్లీ:** పాకిస్థాన్ అంధుల క్రికెట్ జట్టు టీ20 ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్లో పాకిస్థాన్ బంగ్లాదేశ్‌పై 10 వికెట్ల తేడాతో గెలుపొంది, తొలిసారి ఛాంపియన్‌గా అవతరించింది. పాకిస్థాన్‌లోని మల్తాన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. ఆరిఫ్ హుస్సేన్ 54 పరుగులతో టాప్ స్కోర్‌గా నిలిచాడు. పాకిస్థాన్ బౌలర్లలో బాబరన అలీ 2 వికెట్లు పడగొట్టగా, మొహమ్మద్ సల్మాన్, మతివుల్లా తలో వికెట్ దక్కించుకున్నారు. 140 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాకిస్థాన్ కేవలం 11 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా విజయతీరాలకు చేరింది. ఓపెనర్ నిసార్ అలీ అజేయమై అర్థ సెంచరీతో 72 పరుగులు చేసి సత్తాచాటగా, మరో ఓపెనర్ మొహమ్మద్ సఫ్దార్ అజేయమైన 47 పరుగులు చేసి తన జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీ జరిగిన 3 ఎడిషన్లలో 2012, 2017, 2022లో టీమిండియా విజేతగా నిలిచింది. అయితే ఈ ఎడిషన్‌లో భద్రతాకారణాల దృష్ట్యా భారత్‌ప్రభుత్వం టీమిండియ ాను పాకిస్థాన్ పర్యటనకు అనుమతించ లేదు. ఎట్టకేలకు పాక్ నాలుగో ప్రయత్నంలో సొంతగడ్డపై టైటిల్‌ను సాధించింది.

### కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌లో..
## భారత్ ఖాతాలో 31 పతకాలు

**ఢిల్లీ:** కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్-2024 పోటీలు ముగిశాయి. దక్షిణాఫ్రికాలోని దర్బన్ వేదికగా నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల మెగా ఈవెంట్ విజయవంతంగా పూర్తయింది. ఈ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో భారత్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో దేశానికి ఏకంగా 31 పతకాలు సాధించిపెట్టారు. వీటిలో 10 స్వర్ణ పతకాలు, 7 రజత పతకాలు, 14 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇందులో భారత్ ఛాంపియన్ అరబండి కార్తీక్‌రెడ్డి 4 పతకాలు సాధించడం విశేషం. చివరి రోజు ఎలైట్, క్లబ్ కేటగిరీలలో వర్వేరు విభాగాల్లో పోటీ పడిన కార్తీక్ పసిడి, రెండు రజతం, ఇక కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాడు. కాగా కామన్‌వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్-2024లో పతకాలు గెలిచిన భారత్ అథ్లెట్లలో కార్తీక్ ఒక స్వర్ణం, 2 రజతాలు, ఒక కాంస్యం, మేసమ్ ఒక స్వర్ణం, కాంస్యంతో రెండు పతకాలు, భువనేశ్వరి ఒక స్వర్ణం, రెండు కాంస్యాలతో 3 పతకాలు, నవీన్ సర్ణం, కాంస్యంతో రెండు పతకాలు, రోహన్ స్వర్ణం, కాంస్యంతో రెండు పతకాలు, ఆరాధ్య ఒక స్వర్ణ పతకం, ఆర్య ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో మూడు పతకాలు, సమిహాన్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలు, సంకేత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యతంతో రెండు పతకాలు, అమేయ్ ఒక స్వర్ణ పతకం, హాసిని, బిలహరి, రామానుజ, సాయిహర్షలు ఒక్కొక్కరు ఒక్కో రజత పతకం, లిచత రెండు కాంస్య పతకాలు, అమిత్, భార్గవ్, అమిత్ ఆదిత్యలు ఒక్కొక్కరు ఒక్కో కాంస్య పతకం సాధించారు.

# పెరిగిపోతున్న డాలర్, పడిపోతున్న గోల్డ్ ధరలు

**వాషింగ్టన్, డిసెంబరు 3:** ట్రంప్ వైట్ హౌస్ పగ్గాలు చేపట్టడానికి టైం దగ్గర పడుతున్న వేళ అధ్యక్షుడిగా పట్టుబిగించటం ప్రారంభించారు. దీంతో అమెరికా పెత్తనానికి కారణమైన డాలర్ జోలికి వస్తే బ్రిక్ దేశాల తోలు తీస్తానని ట్రంప్ వార్నింగ్ ఇచ్చిన సంగతితెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య చెల్లింపులకు డాలర్ బదులుగా స్థానిక కరెన్సీలు వాడటాన్ని సహించేది లేదని తేల్చి చెప్పటంతో డాలర్ విలువ మరింతగా బలపడుతోంది. నవంబరు నెలలో డాలర్ ఇండెక్స్ 2 శాతం పెరుగుదలను చూసింది. ఇటీవలి కాలంలో పసిడి ధరలు ఆల్ టైం గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పటికీ ప్రస్తుతం కొన్ని రోజులుగా తగ్గుముఖంపడుతున్నాయి. అయితే రానున్న నెలల్లో బంగారం ధరలు ప్రస్తుత స్థాయిలో పెరగకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. గడచిన ఏడాది కాలంలో పసిడిధరలు అంతర్జాతీయ మార్కెట్లలో 29శాతానికి పైగా పెరిగాయి. అలాగే ఆరు నెలల కాలాన్ని పరిశీలిస్తే ఈ పెరుగుదల 12.69 శాతంగా ఉంది. అయితే గడచిన నెల రోజులను చూస్తే ఈ ట్రెండ్ రివర్స్ అయ్యి ధరలు గ్లోబల్ మార్కెట్లలో 3.69 శాతం పతనాన్ని చూశాయి. సెప్టెంబరు2023 తర్వాత బంగారం ధర ఈ మేరకు తగ్గడం ఇదే తొలిసారని నిపుణులు చెబుతున్నారు. యూఎస్ కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలుపుతో డాలర్ విలువ రేసుగుర్రం మాదిరిగా దూసుకుపోతోంది. దీంతో పసిడిపై పెట్టుబడి పెట్టే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని నిపుణులు చెబుతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ ఉద్రిక్తత, మధ్యప్రాచ్య దేశాల్లో ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు మరికొన్ని కారణాలతో అంతర్జాతీయంగా బంగారం ధర గత కొంతకాలంగా పెరుగుదలను చూసిన సంగతి తెలిసిందే. అయితే ట్రంప్ గెలుపు ప్రకటన తర్వాత అంతర్జాతీయంగా అమెరికా డాలర్ విలువ పెరుగుతోంది. దీంతో బంగారం ధర తగ్గుతోందని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ జిగర్ త్రివేది పేర్కొన్నారు. గ్లోబల్ అనిశ్చితులు, వాణిజ్యయుద్ధాల సమయంలో పెట్టుబడిదారులతో పాటు, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు సేఫ్ హెవెన్ గోల్డ్ కొనుగోళ్లు చేపడుతుంటాయి. అయితే ప్రస్తుతం అమెరికాను పారిశ్రామికంగా తిరిగి బలపరిచేందుకు ట్రంప్ చేపట్టనున్న వేళ తిరిగి ప్రపంచ వ్యాప్తంగా యూఎస్ కంపెనీల లాబియింగ్ తిరిగి పుంజుకుంటుందని చాలా మంది భావిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులను ఆపేందుకు సైతం ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు కేడియా కమోడిటీస్ డైరెక్టర్ అజయ్ కేడియా అన్నారు. ఈ క్రమంలోనే అందరి చూపు రాబోయే ఫెడ్ సమావేశంలో వడ్డీ రేట్ల తగ్గింపు ఎంతవరకు ఉంటుందనే అంశంపై దృష్టిని కొనసాగిస్తున్నారు.



# అనిల్ అంబానీకి సెబి షాక్

**ముంబై, డిసెంబరు 3:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కి చెందిన బ్యాంక్ అకౌంట్స్‌తో పాటు షేర్లు అలాగే మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్ అటాచ్ చేయాలని కేపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) ఆదేశించింది. ఈ అటాచ్‌మెంట్ ఆర్డర్ ద్వారా రూ. 26 కోట్ల బకాయిలను రికవరీ చేయనుంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ విషయంలో అక్రమంగా నిధుల మళ్లింపు కేసుకు సంబంధించి ఈ జరిమానా విధించింది. గత నెల నవంబరు 14న రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కి నోటీసు పంపగా 15 రోజుల్లోగా బకాయిలు చెల్లించాల్సిందిగా ఎంటిటీని కోరినతర్వాత ఈ చర్య వచ్చింది. అయితే అంతకు ముందు రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్ సెబి విధించిన జరిమానాను చెల్లించడంలో విఫలమైంది. సెబి ఆర్డర్ ఏం చెబుతోందంటే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా పెండింగ్ బకాయిలను రికవరీ చేయడానికి ఎంటిటీ బ్యాంక్, డీమ్యాట్ అకౌంట్స్ ఇంకా మ్యూచువల్ ఫండ్ ఫోలియోలను అటాచ్‌మెంట్ చేయాలని ఆదేశించింది. నోటీసు ప్రకారం డిఫాల్టర్ డీమ్యాట్ అకౌంట్స్ లేదా మ్యూచువల్ ఫండ్ ఫోలియోలలోని బ్యాంక్ అకౌంట్స్, సెక్యూరిటీలు ఉన్నాయని సెబి పేర్కొంది. సెబి నోటీసు ప్రకారం, రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పెండింగ్‌లో ఉన్న రూ.26కోట్ల బకాయిలు, వడ్డీ ఇంకా రికవరీఖర్చులు ఉంటాయి. ఆర్థికఅవకతవకలపై అనిల్ అంబానీ ఇంకా అతని సహచరుల ప్రమేయంఉన్న వారిని అణిచివేతను తీవ్రతరం చేస్తూ గతవారం మూడు సంస్థలకు అటాచ్‌మెంట్ నోటీసులు జారీచేసింది. అందులో అధార్‌ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్, ఇండియన్ అగ్రి సర్వీస్ ప్రైవేట్‌లిమిటెడ్ ఇంకా మోహన్‌బీర్ హైటెక్ బిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. అనిల్ అంబానీపై ఐదేళ్ల నిషేధం నిధుల మళ్లింపులో పాల్గొన్నందుకు అనిల్ అంబానీ, మాజీ అధికారులతో సహా 24 ఇతర సంస్థలపై సెబి ఐదేళ్ల నిషేధాన్ని విధించింది.



# సిటుసి అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిస్టింగ్ భేష్

**ముంబై, డిసెంబరు 3:** సిటుసి అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీ ఎస్ఎమ్ఇ కేటగిరీలో వచ్చిన ఐపీవో దేశీయ స్టాక్ మార్కెట్లలో గ్రాండ్ లిస్టింగ్ నమోదు చేసింది. వాస్తవానికి కంపెనీ షేర్లు తొలిరోజు మార్కెట్లోకి ఇష్యూ ధర కంటే 90 శాతం ప్రీమియం ధర రూ.429.40 వద్ద ఒక్కోటి అడుగుపెట్టాయి. అయితే లిస్టింగ్ తర్వాత కూడా ఇన్వెస్టర్ల నుంచి షేర్ల కొనుగోలుకు కనిపించిన డిమాండ్ కారణంగా అప్పర్ సర్క్యూట్ తాకాయి. దీంతో బెట్టింగ్ వేసిన ఇన్వెస్టర్లు మెదటి రోజే ఐపీవో నుంచి 100 శాతం రాబడిని అందుకున్నారు. అయితే అప్పర్ సర్క్యూట్ తాకటంతో కంపెనీ షేర్లు ఒక్కోటి రూ.450.85 స్థాయికి చేరుకోవటంతో ఇన్వెస్టర్లుపండుగ చేసుకుంటున్నారు. వాస్తవానికిఅడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఐపీవో దేశీంలోని రిటైల్ ఇన్వెస్టర్లు బెట్టింగ్ వేయటం కోసం నవంబరు 22 నుంచి నవంబరు 26 వరకు అందుబాటులో ఉంది. ఈ క్రమంలో కంపెనీ తన ఐపీవో ప్రైస్ బ్యాండ్ ధరను రూ.214 226గా నిర్ణయించింది. ఈ క్రమంలో కంపెనీ లాట్ పరిమాణాన్ని 600 షేర్లుగా నిర్ణయించటంతో ఐపీవోలో బెట్టింగ్ వేయటానికి ఇన్వెస్టర్లు కనీసం రూ.1,35,600 పెట్టుబడిగా పెట్టాల్సి వచ్చింది. కంపెనీ తాజా ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.99.07 కోట్లను సమీకరించింది.




ఇందుకోసం కంపెనీ 43.84లక్షల తాజా ఈక్విటీ షేర్లను విక్రయించింది. ఈ క్రమంలో కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.28.23 కోట్లను విజయవంతంగా సమీకరించగలిగింది. గతనెలలో అందరూ ఊహించినట్లుగానే ఐపీవో లిస్టింగ్ రోజున ఇన్వెస్టర్ల డబ్బును ఏకంగా రెండింతలుగా మార్చేసింది. కంపెనీ వ్యాపారం కంపెనీ తాజాగా రైజ్ చేస్తున్న నిధులను ఫిక్స్‌డ్ అసెట్స్ కొనుగోలుకు వినియోగించాలనినిర్ణయించింది. బెంగళూరు, దుబాయ్‌లలో ఎక్స్పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# మహీంద్రా ఎలక్ట్రిక్‌పై కోర్టుకెక్కిన ఇండిగో

**ముంబై, డిసెంబరు 3:** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా ఎలక్ట్రిక్ కోర్టుకెక్కింది. మహీంద్రా ఇటీవల విడుదల చేసిన కారు పేరులో '6ఇ' వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహీంద్రా ట్రేడ్ మార్క్ ఉల్లంఘనకు గురైంది. అయితే, మంగళవారం అమిత్ ఇన్సల్ ముందుకు ఈ కేసు విచారణకు రాగా, ఆయన విచారణ నుంచి తప్పుకొన్నారు. దీంతో డిసెంబర్ 9న విచారణ జరిగే అవకాశం ఉంది. ఇండిగో సంస్థ 6ఇ బ్రాండింగు వివిధ సేవలకు వినియోగించుకుంటుంది. 6ఇ పేరుతో విమాన సర్వీసులతో పాటు బిఈ ఫ్లెక్స్ గీత ప్రైమ్ కేఈ లింక్ పేరుతో వివిధ రకాల సేవలనూ అందిస్తోంది. అయితే, మహీంద్రా ఇటీవల విడుదల చేసిన బిఇ 6ఇ మోడల్ కారులో వినియోగించడంపై తాజాగా అత్యంత లేవనెత్తింది. ఈ వ్యవహారంలో తమతో సంప్రదింపులు ఇది సేందుకు మహీంద్రా ప్రయత్నించిందని ఇండిగో తరపు సీనియర్ న్యాయవాది సందీప్ సేథి తెలిపారు. మరోవైపు బీఈ గీతతో పాటు ఎక్స్ కార్లను ఇటీవల మహీంద్రా ఆవిష్కరించింది. ఈ వాహనాలు వచ్చే ఏడాది జనవరి నుంచి అందుబాటులో ఉన్నాయి.




# వాణిజ్యం

## మరోసారి మస్క్‌కు వేతన ప్యాకేజీ విషయంలో ఝలక్

**వాషింగ్టన్, డిసెంబరు 3:** బిలియనీర్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వేతన ప్యాకేజీ విష యంలో మరోసారి షాక్ తగిలింది. ఆయనకు 55.8 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.4.5 లక్షల కోట్లు) ప్యాకేజీని తిరస్కరిస్తూ గతంలో ఇచ్చిన తీర్పును డెలావేర్ కోర్టు మరోసారి సమర్థించింది. వాటాదారుల ఓట్ల ద్వారా ముందుకు తీసుకెళ్లాలని టెస్లా చేసిన ప్రయత్నాన్ని కోర్టు ఆమోదించలేదు. మస్క్ ప్యాకేజీ అధికం. అంత ప్యాకేజీ ఇస్తే వాటాదారులకు అన్యాయం చేసినట్లేనని కోర్టు మరోసారి అభిప్రాయపడింది. గతంలో విచారణ జరిపిన డెలవేర్ కోర్టు, మస్క్ వేతన ప్యాకేజీని నిర్ణయించడంలో తప్పు నిర్ధారించబడింది. ఆ భారీ వేతనాన్ని వదులుకోవాలంటూ ఈ యేడాది జనవరిలో తీర్పు వెలువరించింది. అయితే, కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈ యేడాది జూన్‌లో టెస్లా వార్షికోత్సవప్యాకేజీపై నిర్ణయం తీసుకున్నారు. వాటాదారులకుఓటింగ్ నిర్వహించి మస్క్ 55.8 బిలియన్ డాలర్లవేతన ప్యాకేజీని మళ్లీ ఆమోదించారు. ఈ ఓటింగ్‌ను తీసుకొని ప్యాకేజీపై తీర్పును సవరించాలని కోరుతూ మస్క్ మరోసారి డెలావేర్ కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు మస్క్ పిటిషన్‌ను న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కొట్టివేసి పాత తీర్పునే సమర్థించింది. అంతేకాదు, ఒప్పందాలను మస్క్ 35 మిలియన్ డాలర్ల అటార్నీ ఫీజు విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ తీర్పుపై టెస్లా అసంతృప్తి వ్యక్తం చేసింది. అప్పీల్‌కు వెళ్తామని ప్రకటించారు. కంపెనీ ఓట్లను షేర్ హోల్డర్లను నియంత్రించాలి. న్యాయమూర్తులు కాదు అని మస్క్ ప్రత్యేక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎలాన్ మస్క్ 2018లో అన్నిరకాల ప్రయోజనాలు కలిపి 55.8 బిలియన్ డాలర్ల వార్షిక వేతనం అందుకున్నారు. జాబితా చరిత్రలో ఇదే అత్యధిక పారితోషికం. దీంతో ఆయన బిలియనీర్‌గా మారారు. అయితే, మస్క్ అధికంగా చెల్లించారంటూ వాటాదారుల్లో ఒకరైన రిచర్డ్ టోర్నెట్టా డెలావేర్ కోర్టును ఆశ్రయించారు. ఇంత వేతనం ఇవ్వడమే ఆస్తులను వృథా చేయవచ్చని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు ప్యాకేజీకి ఆమోదించాలని ఆదేశిస్తున్నారని పేర్కొన్నారు.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, డిసెంబరు 3:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో వరుసగా మూడోరోజు లాభాల్లో స్థిరపడ్డాయి. ముఖ్యంగా హెచ్ఇఎఫ్‌సీ, రిలయన్స్, ఎల్అండ్ టీ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. జీడీపీ నెమ్మదించిన నేపథ్యంలో ఈసారి ఎంపీసీ భేటీలో వడ్డీ రేట్లు తగ్గించకపోయినా సీఆర్ఆర్ తగ్గించొచ్చన్న అంచనాలతో మంగళవారం బ్యాంక్ స్టాక్స్ రాణించాయి. దీంతో నిఫ్టీ 24,450 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 80,529.20 పాయింట్లవద్ద (క్రితం ముగింపు 80,248.08) స్వల్ప లాభాలలో చూసింది. కాసేపటికే భారీ లాభాల్లోకి వెళ్లింది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 80,949.10 పాయింట్ల వద్ద తాకిన సూచి చివరికి 587.67 పాయింట్ల లాభంతో 80,845.75 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 181 పాయింట్లు లాభంతో 24,457.15 వద్ద ముగిసింది. డాలరుతోరూపాయి మారకం విలువ 8469గా ఉంది. అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ఆఫ్ ఇండియా, ఎల్అండ్ షేర్లు లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్ టెల్, ఐటీసీ, ఏషియన్ కంపెనీస్, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. RNI No.APTEL/2001/7563.Postal Licence Regd. No. H/KAR/89/12-14